

# విభారె

## తెలుగు దినపత్రిక

## VIBHARE TELUGU DAILY


ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
ఆవుల విజయభాస్కర రెడ్డి B.A.L.L.B
ఆళ్లగడ్డ
9440232308,9494498787



PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి బుధవారం 20-04-2022 సంపుటి: 03 సంచిక: 215 పేజీలు: 4 వెల: రూ 3-00




## ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిన స్వేచ్ఛా

# ఇతిహాసమే భారత స్వరాజ్య సంగ్రామ చరిత్ర

- ఉపరాష్ట్రపతి

స్వాతంత్ర్య సమరయోధుల జీవితాలను యువత అధ్యయనం చేయాలి

వివక్షలకు తావులేని నవ భారత నిర్మాణమే స్వరాజ్య సమరయోధులకు అందించే నిజమైన నివాళి

పాండ్రంగిలోని శ్రీ అల్లూరి సీతారామరాజు జన్మస్థలాన్ని సందర్శించిన ఉపరాష్ట్రపతి

శ్రీ అల్లూరి ఆత్మవిశ్వాసం, తెగువ, దేశభక్తి యువతకు ఆదర్శం కావాలని పిలుపు

బర్లపేటలో ప్రముఖ స్వాతంత్ర సమరయోధులైన రూపాకుల దంపతుల విగ్రహాలను ఆవిష్కరించిన ఉపరాష్ట్రపతి

హరిజనులకు ఆలయ ప్రవేశం, క్విట్ ఇండియా ఉద్యమం, ఉప్పుసత్యాగ్రహం ఉద్యమాల్లో రూపాకుల దంపతుల త్యాగాల ఆదర్శంగా తీసుకోవాలని సూచన

ఆజాదీ కా అమృత్ మహోత్సవాల్లో ప్రతి ఒక్కరూ, ముఖ్యంగా యువత భాగస్వాములు కావాలని సూచన

విశాఖపట్నం, ఏప్రిల్ 19 భారత స్వరాజ్య సంగ్రామం ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిన స్వేచ్ఛా ఇతిహాసమని ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు తెలిపారు. భవిష్యత్ తరాలు స్వేచ్ఛా వాయువులు పీల్చాలన్న ఆకాంక్షతో నాటి స్వాతంత్ర్య సమరయోధులు చేసిన త్యాగాల గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని, ముఖ్యంగా యువతరం నాటి స్వరాజ్య సమరయోధుల స్ఫూర్తితో నవభారత నిర్మాణంలో భాగస్వాములు కావాలని, అదే వారికి అందించే నిజమైన నివాళి అని ఉపరాష్ట్రపతి తెలిపారు.ప్రస్తుతం విశాఖ పర్యటనలో ఉన్న ఉపరాష్ట్రపతి, మంగళవారం నాడు పాండ్రంగిలో ఉన్న శ్రీ అల్లూరి సీతారామరాజు జన్మస్థలాన్ని సందర్శించారు. అనంతరం బర్లపేటకు విచ్చేసిన ఆయన, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు రూపాకుల సుబ్రహ్మణ్యం, రూపాకుల విశాలాక్షి విగ్రహాలను ఆవిష్కరించారు. శ్రీ అల్లూరి సీతారామరాజు జన్మప్రదేశాన్ని సందర్శించిన సమయంలో తమ అనుభవాలను ఫేస్ బుక్ వేదికగా పంచుకున్న ఉపరాష్ట్రపతి, రూపాకుల దంపతుల విగ్రహాలను ఏర్పాటు చేసిన వారి చొరవను అభినందించారు.స్వరాజ్యం సముపార్జించుకుని 75 ఏళ్ళ మైలురాయిని చేరుకుంటున్న తరుణంలో ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ పేరిట కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక ఉత్సవాలను ప్రారంభించడం ఆనందదాయకమన్న ఉపరాష్ట్రపతి, ఈ ఉత్సవాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. ముఖ్యంగా యువత ఈ సందర్భా?న్ని వినియోగించుకుని, నాటి స్వాతంత్ర్య సమరయోధుల జీవితాలను అధ్యయనం చేసి, వారి నుంచి స్ఫూర్తి పొందాలని పేర్కొన్నారు.విద్యార్థి దశ నుంచి తాను ఎంతగానో అభిమానించే స్వరాజ్య సమరయోధుల్లో అల్లూరి ముందు వరుసలో ఉంటారన్న ఉపరాష్ట్రపతి, ఆయన జన్మప్రదేశాన్ని సందర్శించిన క్షణాలు జీవితంలో గుర్తుంచుకోదగిన సందర్భాల్లో ప్రత్యేకమైనవని పేర్కొన్నారు. సరైన బలం ఉంటే ఎవరైనా పోరాడగలరని, అయితే పరిమిత వనరుల మధ్య, అమాయకులైన మన్యం ప్రజల మధ్య, తానే వనరులను సృష్టించుకుంటూ, ప్రజల్లో ప్రేరణ నింపుతూ బ్రిటీష్ సామ్రాజ్య పెత్తనాన్ని ఎదిరించడం తనను ఎంతో ఆకట్టుకుందని తెలిపారు.27 ఏళ్ళ వయసులోనే వీరమరణం పొందిన శ్రీ అల్లూరి దేశభక్తి, ఆత్మవిశ్వాసం, కార్యదీక్ష, చిత్రశుద్ధి యువతకు ఆదర్శనీయమన్న ఉపరాష్ట్రపతి, అల్లూరి సాహసి అంటూ మహాత్ముడు యంగ్ ఇండియా పత్రికలో రాసిన మాటలను ఉటంకించారు. స్థానిక సంస్థల అభివృద్ధి, మద్యపాన నిషేధం, అందరికీ విద్య వంటి మహోన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగిన అల్లూరి ముందు చూపు ఆదర్శనీయమన్న ఆయన, వారిది విప్లవ మార్గమే అయినా, ప్రజల బాగు కోరిన సంక్షేమ మార్గంగా భావిస్తానని తెలిపారు. అల్లూరి జన్మస్థలాన్ని సందర్శించడం తన జీవితాన్ని సింహావలోకనం చేసుకునే అవకాశాన్ని అందించిందన్న ఉపరాష్ట్రపతి, అల్లూరి స్ఫూర్తి తెలుగు వారికే పరిమితం కాకూడదని ఆకాంక్షించారు.భారత స్వరాజ్య సంగ్రామం స్వాతంత్ర్యం కోసం మాత్రమే సాగిన పోరాటం కాదన్న ఉపరాష్ట్రపతి, మన సంస్కృతిని, భాషను, సమాజంలో విస్తరిస్తు?న్న సామాజిక దురాచారాలను అణచివేసేందుకు కూడా ఈ పోరాటం సాగిందన్నారు. ముఖ్యంగా రూపాకుల దంపతులు గాంధీజీ చూపిన బాటలో, ఇదే మార్గంలో ముందుకు సాగారన్న ఆయన, వివిధ ఉద్యమాల్లో ఈ దంపతులు పోషించిన పాత్ర, వారి ధైర్య సాహసాలు, ఒకే తాటి మీద నిలబడ్డ ఆ దంపతుల స్ఫూర్తి ఆదర్శం కావాలన్నారు. కుటుంబం బాగోగులు చూసుకుంటూనే భర్తతో కలిసి స్వరాజ్య ఉద్యమం దిశగా నడిచిన విశాలాక్షి, మహిళా శక్తికి, త్యాగాలకు నిలువెత్తు నిదర్శనమన్న ఉపరాష్ట్రపతి, ఆమె ధైర్య సాహసాలు, ఆత్మవిశ్వాసం ఈతరం యువతకు ఆదర్శం కావాలని ఆకాంక్షించారు. స్వాతంత్ర్య సమరయోధుల గౌరవార్థం ప్రభుత్వం అందించిన ఫించనులోనూ, అధిక భాగం సమాజ సేవకు వెచ్చించిన ఆమె దేశభక్తి, సమాజం పట్ల ప్రేమ ప్రతి ఒక్కరికీ ప్రేరణ కావాలని ఆకాంక్షించారు.బ్రిటీష్ పాలన భారతదేశ అభివృద్ధికి సంకెళ్ళు వేసి, దేశాన్ని బలహీనపరచిందన్న ఆయన, ఘనమైన గతాన్ని కోల్పోయి, పాశ్చాత్య మనస్తత్వంతో కొట్టుకుపోతున్న యువత బయటపడాలని సూచించారు. భారతదేశ సాంస్కృతిక పునరుజ్జీవంతో పాటు, మన జాతీయ భాషల సాహిత్యం, కళాత్మక వ్యక్తీకరణలకు పునర్వైభవం తీసుకువచ్చే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్రను పాఠ్యప్రణాళికలో భాగం చేయాలని సూచించారు.

---

# ఆయనకెలా తెలుసు.. చంద్రబాబు ఏమైనా కేబినెట్‌లో ఉన్నారా..?



ప్రకాశం: ఆంధ్రప్రదేశ్‌లో మంత్రివర్గ విస్తరణపై ఇంకా చర్చ నడుస్తోంది. ఈ నేపథ్యంలో మంత్రి ఆదిమూలపు సురేష్ కేబినెట్ కూర్పుపై స్పందించారు. ఆయన మీడియాతో మంగళవారం మాట్లాడుతూ.. 'పాత మంత్రి వర్గంలో తామంతా రాజీనామా చేసిన తరువాతే తనకు అవసరమైన మంత్రి వర్గానికే ముఖ?యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి అవకాశం కల్పించారు. అంతే తప్ప ఇతర కారణాలేవీ లేవు. వైఎస్సార్‌సీపీ తామంతా వైఎస్ జగన్ బొమ్మ పెట్టుకొని గెలిచిన వాళ్లమే. బాలినేనితో నాకు ఎటువంటి విభేదాలు లేవు. మంత్రి వర్గంలో స్థానం కోల్పోయిన వారికి భావోద్వేగాలు తప్పనిసరిగా ఉంటాయి. అవి నిదానంగా సర్దుకుంటాయి' అని ఆదిమూలపు పేర్కొన్నారు. 'సీఎం జగన్ ఆలోచన ప్రకారమే మేము నడుచుకుంటాం. అవినీతికి తావుండకూడదు అనేది సీఎం జగన్ నినాదం. కేబినేట్ మొత్తాన్ని మారుస్తామని సీఎం ఎప్పుడూ చెప్పలేదు. మొత్తం కేబినేట్‌ను మారుస్తానని ఆయన చెప్పినట్టు చంద్రబాబు అంటున్నారు.. ఈ విషయం ఆయనకు ఎలా తెలుసు..? చంద్రబాబు ఏమైనా కేబినెట్‌లో ఉన్నారా..?. వైఎస్సార్‌సీపీ కేబినేట్ మంత్రులమంతా రెట్టింపు ఉత్సాహంతో పనిచేస్తున్నాం. చంద్రబాబులో అభద్రతాభావం ఏర్పడింది. జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌కు ఒక జెండా.. అజెండా అంటూ ఏమీలేదు. పల్లకి మోయడమే ఆయన అజెండా. అందుకే ఆయన వైఎస్సార్‌సీపీ వ్యతిరేక ఓట్లు చీలకుండా వాటిన్నింటిని గుంపగుత్తగా వేరేవారికి అప్పచెబుతామనే సిద్ధాంత ధోరణిని అవలంభిస్తున్నారు. దీనిని ఎవరైనా పార్టీ సిద్ధాంతం అంటారా?' అని మంత్రి ఆది మూలపు సురేష్ ప?రశ్నించారు.


# రష్యా మిస్సైళ్ల దాడిలో ఏడుగురు మృతి



న్యూఢిల్లీ : ఉక్రెయిన్‌పై రష్యా సైనిక చర్య కొనసాగుతున్నది. సోమవారం పశ్చిమ ఉక్రెయిన్లోని ఎల్వివ్ నగరంలో పలు మిస్సైళ్లతో జరిపిన దాడుల్లో ఏడుగురు మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. మరో వైపు అధ్యక్షుడు వోలోడిమిర్ జెలెన్‌స్కీ వ్యూహాత్మకంగా ముఖ్యమైన మారియుపోల్ నగరంలో చివరి వరకు పోరాడుతామని స్పష్టం చేశారు. ఓడరేవుల నగరంగా ప్రసిద్ధి చెందిన నగరంలో భారీ స్టీల్ ప్లాంట్లను రష్యన్ సైన్యం ధ్వంసం చేసింది.సోమవారం జరిపిన రష్యా జరిపిన మిస్సైల్ దాడుల్లో ఏడుగురు మరణించారని, ఒక చిన్నారి సహా ఎనిమిది గాయపడ్డారని ఎల్వివ్ గవర్నర్ మక్సిమ్ కోజిటిస్కీ పేర్కొన్నారు. ఉక్రెయిన్ తూర్పు పారిశ్రామిక ప్రాంతం డాన్‌బాస్‌లోని ఆయుధ కర్మాగారాలు, రైల్వేలు, ఇతర మౌలిక సదుపాయాలే లక్ష్యంగా రష్యా దాడులు చేస్తున్నది. మరో వైపు రష్యాకు లొంగిపోయేది లేదని ఇప్పటికే జెలెన్‌స్కీ స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా.. ఉక్రేనియన్ నగరాలపై దాడిని కొనసాగించేందుకు రష్యా దళాలకు సహాయం చేయడానికి సిరియన్ సైన్యం యుద్ధంలో పాల్గొనాలని యోచిస్తున్నారు.అంతకు ముందు, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ 2017 సిరియా పర్యటన సందర్భంగా అక్కడి జనరల్‌ను ప్రశంసించారు. ఈ క్రమంలో బ్రిగేడియర్ జనరల్ సుహైల్ అల్ హసన్ ఆధ్వర్యంలో సిరియా దళాలు రష్యా తరఫున ఉక్రెయిన్‌లో పోరాడేందుకు సిద్ధంగా ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. మరో వైపు మరియూపోల్‌లో పరిస్థితి దారుణంగా ఉందని ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి డిమిత్రి కులేబా పేర్కొన్నారు. నగరంలో ఉక్రేనియన్ ఆర్మీ సిబ్బంది, పౌరులను రష్యన్ దళాలు చుట్టుముట్టాయన్నారు. ఉక్రెయిన్ పోరాటం కొనసాగుతుందని, కానీ భారీ విధ్వంసం కారణంగా ఇప్పుడు నగరం ఉనికిలో లేదని పేర్కొన్నారు.మరో వైపు రష్యా దూకుడుతో నష్టపోయిన వారిని ఆదుకునేందుకు యూరోపియన్ యూనియన్ (ఈయూ) అదనంగా 50 మిలియన్ యూరోల మానవతా నిధులను ఉక్రెయిన్‌కు కేటాయిస్తున్నట్లు యూరోపియన్ కమిషన్ ప్రకటించింది. ఇందులో ఉక్రెయిన్‌లోని మానవతా ప్రాజెక్టుల కోసం 45 మిలియన్లు, మోల్డోవా కోసం 5 మిలియన్ల యూరోల సాయం అందిస్తున్నట్లు తెలిపింది.

## టీటీడీ పాలకమండలిలో నేరచరితులు, ప్రత్యేక ఆహ్వానితులపై హైకోర్టులో విచారణ

అమరావతి: తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలిలో నేరచరితులు, ప్రత్యేక ఆహ్వానితుల జాబితాపై హైకోర్టులో విచారణ జరిగింది. ఎమ్మెల్యే కరుణాకర్ రెడ్డితో పాటు తనను పాలకమండలి సమావేశానికి హాజరయ్యేలా ఆదేశాలు ఇవ్వాలని ఎస్. సుధాకర్ పిటీషన్ వేశారు. అయితే వెంటనే ఆదేశాలు ఇచ్చేందుకు ధర్మాసనం నిరాకరించింది. మరికొన్ని పిటీషన్లలో కౌంటర్ వేయాలని ప్రభుత్వానికి, టీటీడీకి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. పిటీషనర్ల తరఫున న్యాయవాదులు ఆశ్వినీకుమార్, యలమంజుల బాలాజీ వాదనలు వినిపించారు. ప్రత్యేక ఆహ్వానితుల జాబితాపై ఉమామహేశ్వర నాయుడు, పాలకవర్గంలో నేరచరితులపై బీజేపీ నేత భాను ప్రకాష్ రెడ్డి పిటీషన్లు దాఖలు చేశారు. తుది వాదనలు వినేందుకు కేసు విచారణను హైకోర్టు జూన్ 20కి వాయిదా వేసింది.



## టీడీపీ అభిప్రాయాలని ఈనాడు ద్వారా చెప్పించారు: మేరుగ నాగార్జున

తాడేపల్లి: పేద విద్యార్థులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలుస్తున్నారని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున తెలిపారు. ప్రభుత్వంపై బురదజల్లడమే చంద్రబాబు పనిగా పెట్టుకున్నారని అన్నారు. ఆసరా పథకంతో లక్షల కుటుంబాలకు అండగా నిలుస్తున్నామని తెలిపారు. టీడీపీ అభిప్రాయాలని ఈనాడు ద్వారా చెప్పించారని మండిపడ్డారు.సంక్షేమ పథకాలు ఆగిపోవాలని వారు భావిస్తున్నారని దుయ్యబట్టారు. రాష్ట్ర ప్రజలు ఈ కుట్రలని గమనించాలని కోరుతున్నానని తెలిపారు. చంద్రబాబుకి ఎవరైనా ఓటేస్తే ఈ పథకాలు ఆపేస్తామని చెప్పకనే చెప్పారని అన్నారు. జగనన్న అమ్మ ఒడి ద్వారా 44 లక్షలపైన తల్లులకి అమలు చేస్తున్నామని తెలిపారు. ఎల్లో మీడియా ద్వారా చంద్రబాబు కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు.

# ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను పక్కాగా అమలు చేస్తాం: ఏపీ డీజీపీ



అమరావతి: ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను పక్కాగా అమలు చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు ఏపీ డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. ఆయన మంగళవారం రాష్ట్ర హోం మంత్రి తానేటి వనితను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పోలీసు స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. క్రైమ్ రేటు తగ్గింపు, నాటు సారా అరికట్టడంపై ప్రత్యేక దృష్టి పెట్టామని చెప్పారు.నెల్లూరు కోర్టులో దొంగతనంపై సాక్ష్యాలు ఆధారంగా ముందుకెళ్లామని చెప్పారు. విచారణలో వాస్తవాలని బట్టి ముందుకెళ్లాలని తెలిపారు. కేసులపై ఆరోపణలు చేయవచ్చు, కానీ వాస్తవాలు విచారణలో బయటపడతాయని తెలిపారు. ఎవరిదగ్గరైనా ఆధారాలుంటే ఇవ్వాలని సమన్లు జారీ చేశామని అన్నారు. ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి విచారణ చేపట్టామని పేర్కొన్నారు. దిశ యాప్‌లో రిజిస్టర్ చేసుకుంటే మహిళల వ్యక్తిగత సమాచారానికి ఇబ్బంది ఉండదని స్పష్టం చేశారు.ఆలూరు ఘటనలో 82 మందిని అరెస్ట్ చేశామని పేర్కొన్నారు. శాంతిభద్రతల విషయంలో ఎవరినీ ఉపేక్షించేది లేదన్నారు. కఠినంగా లా అండ్ ఆర్డర్ విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు.

## పేదల అభివృద్ధిని చూసి బాబు ఓర్వలేకపోతున్నాడు: నారాయణ స్వామి

తాడేపల్లి: నిరుపేదల కోసం సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నవరత్నాలు ప్రవేశపెట్టారని డిప్యూటీ సీఎం నారాయణ స్వామి తెలిపారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పేదల అభివృద్ధిని చూసి చంద్రబాబు ఓర్వలేకపోతున్నాడని మండిపడ్డారు. సంక్షేమ పథకాలని నిరుపేదల అందించడమే లక్ష్యంగా సీఎం జగన్ పాలన చేస్తున్నారని అన్నారు.శంకరన్ అనే ఐఎఎస్ కృషితో దేశంలో 20 సూత్రాలు అమలయ్యాయని పేర్కొన్నారు. ఆ తర్వాత ఎన్టీఆర్, వైఎస్సార్‌లు పేదల సంక్షేమమే ధ్యేయంగా పరిపాలన చేశారని గుర్తుచేశారు. మాజీ సీఎస్ ఎల్వీ సుబ్రమణ్యం, పీవీ రమేష్ ఆరోపణలని నారాయణ స్వామి తీవ్రంగా ఖండించారు. ఈ ఇద్దరు ఐఎఎస్‌లు పేదవాళ్లకి ఆగర్భ శత్రువులుగా కనపడుతున్నారని తెలిపారు. చంద్రబాబు మాదిరిగా పోలవరం ప్రాజెక్ట్‌ను ఎలా ఏటిఎంలా ఉపయోగించుకున్నారో చూశామని తెలిపారు.చంద్రబాబుకి పొరపాటున ఓటేస్తే ఈ సంక్షేమ పథకాలని ఆపేస్తామని స్పష్టం చేసినట్లు కనిపిస్తోందని మండిపడ్డారు. చంద్రబాబు అప్పులు చేసినపుడు ఎల్వీ సుబ్రమణ్యం, పీవీ రమేష్‌లు ఏం చేశారని నిలదీశారు. చంద్రబాబు ప్రజల కోసం ఏ రోజూ తపన పడలేదని అన్నారు. చంద్రబాబుకు ఎందుకు ఈ ఇద్దరు అధికారులు వత్తాసు పలుకుతున్నారని విమర్శించారు. చంద్రబాబు ఒక్క ప్రాజెక్టునైనా కట్టి చూపించారా? అని ప్రశ్నించారు.చంద్రబాబు హయాంలో నిర్మాణమైన రోడ్లు వర్షాలకి కొట్టుకుపోవడం లేదా? అని నిలదీశారు. చంద్రబాబు చేసిన అప్పులు దేనికి ఖర్చు చేశారో ఈ ఇద్దరు అధికారులు చెప్పాలని ప్రశ్నించారు. చంద్రబాబు ఒంటరిగా పోటీ చేయగలరా? వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఒంటరిగానే పోటీ చేస్తుందని తెలిపారు. పేదలకోసం సీఎం వైఎస్ జగన్ ఖర్చు చేస్తే వృధా ఖర్చా? చంద్రబాబు ఎలా ఖర్చు చేసినా మాట్లాడరా? అని నారాయణ స్వామి ధ్వజమెత్తారు.

# సంపాదకీయం

బుధవారం,20-04-2022

## కాంగ్రెస్ మూడో ఫ్రంట్ అడుగులు

2024 సార్వత్రిక ఎన్నికలే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ యునైటెడ్ ప్రొగ్రెస్సివ్ అలయెన్స్ (యుపీఏ)ను బలోపేతం చేసేందుకు సిద్ధమవుతోంది. దీనికి సంబంధించి కూటమిలో పెద్దన్నగా తామేం చేయాలి.. అలియెన్స్‌లోని మిగిలిన పార్టీలు ఏం చేయాలి అనే దానికి సంబంధించిన పని విభజన జరిగినట్లు తెలుస్తోంది. జాతీయ స్థాయిలో ప్రధాని మోదీ చరిష్మాను ఎదుర్కొనేందుకు ఇప్పటి నుంచే ప్రిపేర్ కావాల్సిన అవసరాన్ని గుర్తించిన యుపీఏ సారథి సోనియాగాంధీ దానికి అనుగుణంగా కార్యాచరణ రూపొందించడమే కాకుండా దాని అమలుకు కూడా శ్రీకారం చుట్టారు. ముందుగా మైనారిటీలకు యుపీఏని దగ్గర చేసే సంకల్పానికి శ్రీకారం చుట్టారు. దేశంలో మత విద్వేషాలు ప్రబలుతున్నాయంటూ అందుకు శ్రీరామనవమి, హనుమాన్ జన్మ పర్వదినం సందర్భంగా పలు రాష్ట్రాలలో జరిగిన ఘర్షణలను ప్రస్తావిస్తూ కాంగ్రెస్ అనుకూల 13 పార్టీల నేతలతో దేశ ప్రజలకు ఓపెన్ లెటర్ రాశారు. అయితే.. ఘర్షణలు జరిగిన పలు రాష్ట్రాలలో కొన్ని కాంగ్రెస్ పార్టీ పాలిత రాష్ట్రాలున్న విషయాన్ని, శాంతి భద్రతల అంశం రాష్ట్రాల ఎజెండాలోనిదని కాంగ్రెస్ పెద్దలు చాలా కన్వీనియెంట్‌గా విస్మరించడం ఇపుడు చర్చనీయాంశమైంది. ఈ విషయాన్ని పక్కన పెడితే.. కాంగ్రెస్ పార్టీ సార్వత్రిక ఎన్నికలకు సరిగ్గా రెండేళ్ళ ముందే యుపీఏ బలోపేతానికి చర్యలు ప్రారంభించినట్లు తేటతెల్లమైంది ఈ బహిరంగ లేఖ ద్వారా. మిత్రపక్షాలను ఏకం చేయడం, కొత్త ఫ్రెండ్స్‌ని దగ్గర చేసుకోవడం అనే ద్విముఖ వ్యూహాన్ని యుపీఏ పెద్దన్న ప్రారంభించినట్లు తెలుస్తోంది. 13 రాజకీయ పార్టీల అధినేతల సంతకాలతో దేశ ప్రజలకు రాసిన బహిరంగ లేఖ మరో అంశాన్ని కూడా వెల్లడించింది. కాంగ్రెసేతర, బీజేపీయేతర కూటమికి తానే సారథ్యం వహిస్తానంటూ.. అవసరమైతే మోదీ చరిష్మాను తానే ఎదుర్కొంటానంటూ హూంకరించిన బెంగాల్ టైగర్, ముఖ్యమంత్రి, తృణమూల్ అధినేత్రి మమతాబెనర్జీ కాంగ్రెస్ నాయకత్వంలో పని చేయడం ద్వారా తమ ప్రధాన ప్రత్యర్థి బీజేపీని దెబ్బకొట్టేందుకు సిద్ధమైనట్లు ఈ బహిరంగ లేఖ వెల్లడించింది. ఈసారి యుపీఏను బలోపేతం చేసే బాధ్యతలను రాజకీయ దురంధరుడు శరద్ పవార్ తీసుకున్నట్లు పరిణామాలను పరిశీలిస్తే బోధపడుతోంది. కాంగ్రెస్ దూరంగా కొనసాగుతున్న మమతా బెనర్జీని యుపీఏకి దగ్గర చేసింది శరద్ పవారే అంటున్నారు. అదేసమయంలో బీజేపీ పట్ల గుర్రుగా వున్న శివసేన ఎంపీ సంజయ్ రౌత్ కూడా యుపీఏను స్ట్రెంథెన్ చేసేందుకు తన వంతు బాధ్యతలు చేపట్టినట్లు కనిపిస్తోంది. యుపీఏలో లేని బీజేపీయేతర పార్టీలను కాంగ్రెస్ పార్టీకి దగ్గర చేసేందుకు సంజయ్ రౌత్ యత్నాలు మొదలు పెట్టారు. దేశంలో రాజకీయ పరిస్థితులను చర్చించే పేరిట బీజేపీయేతర ముఖ్యమంత్రులను ముంబయి వేదికగా కలిపేందుకు రౌత్ ఏర్పాట్లు ప్రారంభించారు. దేశంలో చోటుచేసుకుంటున్న పరిణామాలు, వాటి వెనుక మత విద్వేషాలను రెచ్చగొట్టే సంఘ్ పరివార్ వ్యూహాలపై చర్చించే ఎజెండాతో బీజేపీయేతర సీఎంలను దేశ వాణిజ్య రాజధాని ముంబయి వేదికగా ఒకచోట చేర్చే బాధ్యతలను కాంగ్రెస్ పార్టీ తమ సహచర పార్టీ శివసేనకు అప్పగించినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీ స్వయంగా ఈ భేటీ నిర్వహిస్తే పలువురు సీఎంలు రాకపోవచ్చన్న వ్యూహంతోనే ఈ భేటీ నిర్వహణ బాధ్యతలను శివసేనకు అప్పగించినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. లెక్కచూపని ఆర్థిక లావాదేవీలపై ఈడీ విచారణను ఎదుర్కొంటున్న శివసేన ఎంపీ సంజయ్ రౌత్.. జాతీయ దర్యాప్తు సంస్థలను మోదీ ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందన్న అంశాని బీజేపీయేతర సీఎంల భేటీ ఎజెండాగా పేర్కొనడం విశేషం. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, మత స్వేచ్ఛ వంటి అంశాలను కూడా ఈ భేటీ ఎజెండాగా చేర్చారు. పార్టీ యాక్షన్ ప్లాన్ సక్సెస్సయితే మాత్రం మే నెలలోనే ముంబయి వేదికగా బీజేపీయేతర ముఖ్యమంత్రుల సమావేశం జరగనున్నది. తద్వారా యుపీఏ బలోపేతం దిశగా కాంగ్రెస్ పార్టీ యత్నాలు వేగవంతం కానున్నాయి. ఓరకంగా చెప్పాలంటే ఏప్రిల్ 17వ తేదీ నాటి 13 పార్టీల బహిరంగ లేఖ ద్వారానే యుపీఏ పునరేకీరణ యత్నాలు ప్రారంభమైనట్లు భావించాలి. ఎన్సీపీ, శివసేన, డీఎంకే, ఝార్ఖండ్ ముక్తి మోర్చా వంటి పార్టీలు యుపీఏలో కొనసాగుతూ వస్తున్నాయి. తాజాగా 13 పార్టీలు కాంగ్రెస్ ఎంజెండాకు జై కొడుతున్నట్లుగా తెలుస్తోంది. ఈక్రమంలో దేశంలో అసలు థర్డ్ ఫ్రంట్ (కొన్ని పార్టీలు దీన్నే ఫెడరల్ ఫ్రంట్ అనే పేరుతో పిలుస్తున్నాయి)కి ఆస్కారం వుందా ? ఇదిపుడు బాగా ఆసక్తి రేపే ప్రశ్నగా కనిపిస్తోంది. ఎందుకంటే థర్డ్ ఫ్రంట్ ప్రయత్నాలను చేసిన నేతల్లో చాలా మంది మెల్లిగా కాంగ్రెస్ సారథ్యంలోని యుపీఏ వైపు మొగ్గు చూపుతున్నట్లు కనిపిస్తోంది. బెంగాల్‌లో సాధించిన ఘన విజయం తర్వాత దేశంలో మూడో ఫ్రంట్‌కు తానే సారథ్యం వహిస్తానని మాట్లాడిన మమతా బెనర్జీ ఇపుడు కాంగ్రెస్ పార్టీతో కలిసి పని చేసేందుకు సిద్దమయ్యారు. అందుకే బహిరంగ లేఖలో ఆమె పేరు చేరింది. ఇంకోవైపు మూడో కూటమి గురించి ఎప్పుడూ మాట్లాడని ఆప్ అధ్యక్షుడు అరవింద్ కేజ్రీవాల్ పంజాబ్‌లో కాంగ్రెస్ పార్టీని కుదేలు చేసిన తర్వాత తిరిగి కాంగ్రెస్ పార్టీతో కలిసేందుకు రెడీ అవుతున్నట్లు జాతీయ మీడియా రాస్తోంది. ఇందుకు గోవాలో కాంగ్రెస్ పార్టీతో కలిసేందుకు కేజ్రీవాల్ ఇదివరకే విఫలయత్నం చేసిన ఉదంతాన్ని గుర్తు చేస్తున్నారు. ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్, తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్, ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మాత్రమే కాంగ్రెస్ పార్టీతో దూరాన్ని మెయింటేన్ చేస్తున్నారు. వీరిలో నవీన్ పట్నాయక్ సంగతి పక్కన పెడితే.. జగన్, కేసీఆర్‌లు కాంగ్రెస్ పార్టీకి దగ్గరవడం కష్టమేనని భావించాలి. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని కేసీఆర్ ప్రత్యర్థిగానే భావిస్తున్నారు. దానికితోడు ఏప్రిల్ 17న హైదరాబాద్ వచ్చిన తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జీ మాణిక్కం ఠాగూర్.. టీఆర్ఎస్‌తో ఎలాంటి పొత్తు ఉండబోదని కుండబద్దలు కొట్టారు. ఇంకోవైపు వైసీపీ అధినేత జగన్.. సోనియా గాంధీ వల్లే తాను తన తండ్రి మరణానంతరం వెంటనే సీఎం కాలేకపోయానని భావిస్తారు. ఆయనా కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా మారే అవకాశాలు తక్కువే. ఇక్కడ ఓ ఆసక్తికరమైన అబ్జర్వేషన్ గురించి చెప్పుకోవాలి. ఫెడరల్ ఫ్రంట్ పేరిట యత్నాలు మొదలు పెట్టిన కేసీఆర్.. ఇప్పటి వరకు కాంగ్రెస్ పార్టీకి దగ్గరగా వున్న పార్టీల నేతలను, సీఎంలనే కలిసారు. బీజేపీతో సన్నిహితంగా వున్న పార్టీలను, నేతలను ఆయన కల్వలేదు. దీని ఆధారంగా కేసీఆర్ ఫెడరల్ యత్నాలు యుపీఏని వీక్ చేయడం, బీజేపీ సారథ్యంలోని ఎన్డీయేను డిస్టర్బ్ చేయకపోవడమే కేసీఆర్ వ్యూహమన్న కంక్లూజన్‌కు కాంగ్రెస్ నేతలను చేర్చిందని తెలుస్తోంది. చెన్నై వెళ్ళి డిఎంకే అధినేత, సీఎం స్టాలిన్‌ను కలిశారు. అంతకు ముందు శివసేన అధినేత ఉద్ధవ్ థాక్రేను, ఎన్సీపీ అధినేత శరద్ పవార్‌ను కలిశారు. ఢిల్లీ వెళ్ళిన కేసీఆర్ కేజ్రీవాల్‌తో భేటీ కాలేదు.

# కాకాణికి కేసుల బెడద

నెల్లూరు, ఏప్రిల్ 19,కాకాణి గోవర్ధన్‌రెడ్డి. నెల్లూరు జిల్లా సర్వేపల్లి ఎమ్మెల్యే. ప్రస్తుతం వ్యవసాయ శాఖ మంత్రి. 2019లో వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసినప్పుడే తొలి కేబినెట్‌లో చోటు దక్కుతుందని ఆశించారు కాకాణి. కానీ.. అనుకున్నదొక్కటీ.. అయ్యిందొక్కటీ. ఇటీవల చేపట్టిన కేబినెట్ పునర్ వ్యవస్థీకరణలో మాత్రం ఆశ నెరవేరింది. పొలిటికల్‌గా జీవితాశయం నెరవేరిందన్న సంతోషంలో ఉండగానే.. సొంత జిల్లా నెల్లూరులో కాకాణికి కొత్త కష్టాలు స్వాగతం పలుకుతున్నాయి. వాటి గురించే ఇప్పుడు అధికారపార్టీలో.. పొలిటికల్ సర్కిళ్లలో జోరుగా చర్చ జరుగుతోంది. మంత్రిగా కాకాణి ప్రమాణ స్వీకారం చేసిన మరుసటి రోజే మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్.. జర్క్ ఇచ్చారు. తాను మంత్రిగా ఉన్నప్పుడు తనపట్ల కాకాణి ఎంత ప్రేమ.. అనురాగం కురిపించారో.. సహకారం అందించారో అంతకు రెట్టింపు ఇస్తారనని వ్యంగ్యాస్త్రాలు సంధించారు అనిల్. ఆ కామెంట్స్‌పై చర్చ జరుగుతున్న సమయంలోనే మంత్రి కాకాణికి శుభాకాంక్షలు తెలియజేస్తూ నెల్లూరు సిటీలో అభిమానులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను గుర్తుతెలియని వ్యక్తులు చించేశారు. ఇది అనిల్ వర్గం పని అనేది కాకాణి అనుచరుల అనుమానం. మంత్రిగా సొంత జిల్లాలో కాకాణి అడుగుపెడుతున్న రోజే.. నెల్లూరులో అనిల్ బహిరంగ సభ పెట్టడం కూడా చర్చగా మారింది. ఇది బల ప్రదర్శన కాదని అనిల్ వర్గం చెబుతున్నా.. తన వర్గం నుంచి ఎవరూ కాకాణి దగ్గరకు వెళ్లకుండా కట్టడి చేయడానికి సభ పెట్టారన్నది కొందరి అభిప్రాయం. ఇంతలో కోర్టులో డాక్యుమెంట్ల చోరీ కేసు రాష్ట్రంలో సంచలనం రేపింది. ఐదేళ్ల క్రితం టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి? కాకాణిపై పెట్టిన కేసు అనూహ్య మలుపు తీసుకుంది. విదేశాల్లో తనకు వేల కోట్లు ఉన్నాయన్న కాకాణి ఆరోపణలపై సోమిరెడ్డి కేసు పెట్టారు. కాకాణి చూపించిన పత్రాలు నకిలీవిగా తేలడంతో ఆ కేసులో కాకాణి ఏవన్‌గా ఉన్నారు. ఈ కేసు విచారణకు వచ్చే తరుణంలో కీలకంగా భావిస్తున్న డాక్యుమెంట్లు కోర్టు నుంచి చోరీ అయ్యాయి. చోరీ వెనక కాకాణి వర్గం ఉందన్నది టీడీపీ ఆరోపణ. శిక్ష పడుతుందని తెలిసే సాక్ష్యాలను మాయం చేశారని.. ఈ అంశంపై సుప్రీంకోర్టు వరకు వెళ్తామని టీడీపీ నేతలు చెబుతున్నారు. కోర్టులో చోరీ కూడా మంత్రి కాకాణి శిబిరాన్ని ఇరకాటంలో పడేసిందని టాక్. ఒకవైపు సొంతపార్టీ నేతల వ్యంగ్యాస్త్రాలు.. ఫ్లెక్సీల చించివేత.. బలప్రదర్శన.. ఇంకోవైపు కోర్టులో చోరీ.. మంత్రికి ఆదిలోనే హంసపాదుగా మారాయని వైసీపీ వర్గాలు చెవులు కొరుక్కుంటున్నాయి. అందుకే రానున్న రోజులు మంత్రిగా కాకాణికి సొంత జిల్లాలో ముళ్లబాటేనని అభిప్రాయపడుతున్నారట.

కేసుల పరంపర ఇదీ

ఇటీవల ఎవరిపై ఇంత రచ్చ జరగలేదు. ఇటీవల ఏ కేసులోనూ ఇంత సంచలనం నెలకొనలేదు. ఆయన మంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. రోజుల వ్యవధిలోనే ఏకంగా కోర్టులోనే దొంగతనం జరిగింది. మంత్రి కేసు తాలూకూ సాక్షాధారాలు మాత్రమే ఎత్తుకెళ్లారు. దొంగలు దొరికినా.. వారికి రాజకీయ సంబంధం లేదని తేల్చారు. కట్ చేస్తే.. అదే మంత్రి కాకాణి విల్లాలో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా చనిపోయాడు. ఇలా, సినిమాటిక్‌గా సాగుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఎపిసోడ్ పొలిటికల్‌గా ఫుల్ కాంట్రవర్సీగా మారింది. ఓవైపు మాజీ మంత్రి అనిల్‌కుమార్.. పోటీ సభలు, ప్రెస్‌మీట్లు, సర్వేపల్లిలో పర్యటనలతో కాకాణిని సవాల్ చేస్తుంటే.. మరోవైపు, వరుస ఘటనలు కొత్త మంత్రిని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. తాజాగా, టీడీపీ సైతం రంగంలోకి దిగి.. కాకాణిని అనుమానాలు, ప్రశ్నలతో కుమ్మేయడంతో.. కాకాణికి మంత్రి అయ్యాననే సంతోషమే లేకుండా పోయింది. కాకాణి గోవర్ధన్ రెడ్డి మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే అరాచక పర్వానికి తెర తీశారని టీడీపీ నేత ధూళిపాళ్ల నరేంద్ర ఆరోపించారు. కాకాణి ఏడు కేసుల్లో ముద్దాయని గుర్తు చేశారు. నెల్లూరు కోర్టు చోరీపై చాలా అనుమానాలు ఉన్నాయన్నారు. సెలవు రోజు కోర్టు ఉద్యోగి.. కోర్టుకు ఎందుకు వెళ్లాడని ప్రశ్నించారు. కాలువలో సంచి ఉన్నట్లు ఎలా చెప్పాడన్నారు. ఎస్పీ కల్పిత కథ అల్లారని, వేల కేసుల ఫైల్స్ ఉంటే కేవలం కాకాణి కేసుకు చెందిన ఆధారాలున్న బీరువా మాత్రమే దొంగలకు కనిపించిందా? అని నిలదీశారు. ప్రభుత్వ పెద్దల సహకారం లేకుండా చోరీ జరగలేదని ధూళిపాళ్ల అనుమానం వ్యక్తం చేశారు. మంగళగిరిలోని కాకాణి విల్లాలో మహమ్మద్ అనే వ్యక్తి చనిపోయారు. ఏసీ మెకానిక్ మహమ్మద్ మృతిపై చాలా అనుమానాలున్నాయి. మహమ్మద్ మృతికి.. చోరీ కేసుకు ఉన్న సంబంధమేంటి? సుమోటోగా న్యాయమూర్తులే సీబీఐ విచారణ జరిపించాలి.

పోలీసులు దర్యాప్తుతో ఎలాంటి ఉపయోగం ఉండదు" అని ధూళిపాళ్ల నరేంద్ర అన్నారు. మరోవైపు, విల్లాలో శవం వ్యవహారం కాకాణి మెడకు చుట్టుకుంటోంది. మంగళగిరిలో మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డికి చెందిన విల్లాలో ఓ యువకుడు అనుమానాస్పదస్థితిలో మృతిచెందాడు. శనివారం ఉదయం మరణించగా, ఆదివారం ఉదయం వరకు విషయం గోప్యంగా ఉంచారు. విద్యుత్ షాక్‌తో చనిపోయాడని పోలీసులు చెబుతుండగా, హత్య చేశారని యువకుడి బంధువులు ఆరోపించారు. ఘటనపై దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. ఆందోళన చేపట్టేందుకు బంధువులు సిద్ధమవగా.. మంత్రి పీఏ రంగప్రవేశం చేసి స్థానిక వైసీపీ నేతల సాయంతో మృతుడి కుటుంబీకులతో బేరాలకు దిగినట్టు తెలుస్తోంది. మృతుడి కుటుంబీకులు రూ.12 లక్షలు ఇవ్వాలని పట్టుబట్టగా.. చివరకు 6 లక్షలకు ఒప్పించారు. అందులో మంత్రి కాకాణి 3 లక్షలు, మెకానిక్ షాపు యజమాని షేక్ యూసూబ్ 3 లక్షలు ఇచ్చేలా డీల్ కుదిరినట్టు సమాచారం.

# ధర్మాన సూక్తిముక్తావళి



శ్రీకాకుళం, ఏప్రిల్ 19, మర్మం లేకుండా మాట్లాడేస్తారు. మెలితిప్పే కామెంట్స్ అస్సలు ఉండవు. సూటిగా సుత్తిలేకుండా చెప్పేస్తారు. ఇన్నాళ్లూ ఆయన ఏం చెప్పినా చర్చే. ఇప్పుడు మాత్రం ఆయన మంత్రి. అభినందన సభలోనే నర్మగర్భ వ్యాఖ్యలతో కలకలం రేపారు. కాకపోతే ఆ ధర్మ సూక్తులు ఎవరికన్నదే ప్రస్తుతం ప్రశ్న. హాట్ టాపిక్‌గా మంత్రి ధర్మాన కామెంట్స్ ధర్మాన ప్రసాదరావు. తాజా మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలో చోటు దక్కించుకున్నారు. చాలా గ్యాప్ తర్వాత మంత్రి హోదాలో జిల్లాకు రావడంతో అభిమానులు, పార్టీ కార్యకర్తలు శ్రీకాకుళం హైస్కూల్ గ్రౌండ్‌లో సభ ఏర్పాటు చేశారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. ఈ సభలో మంత్రి ధర్మాన చేసిన వ్యాఖ్యలే హాట్ టాపిక్‌గా మారాయి. ప్రసాదరావు అన్నయ్య కృష్ణదాసే రెవెన్యూ మంత్రి. రెవెన్యూ శాఖలో అవినీతి ఎక్కువైందనేది ధర్మాన మాట. సదరు రెవెన్యూ శాఖకు ఇంత వరకు మంత్రిగా ఉన్నది ఆయన అన్నయ్య ధర్మాన కృష్ణదాసే. తన విభాగంలో పారదర్శక పాలన అందిస్తున్నామని.. బ్రిటిష్ కాలంలో భూములకు రీ సర్వే చేస్తూ.. యజమానికి శాశ్వత భూ హక్కు పత్రాలు అందజేస్తున్నట్టు కృష్ణదాస్ డిప్యూటీ సీఎం హోదాలో అప్పట్లో చెప్పుకొచ్చారు. అయితే కేబినెట్‌లో అన్న చోటు కోల్పోయారు. ఆ స్థానంలో వచ్చిన ధర్మాన ప్రసాదరావు రెవెన్యూ శాఖను చేపట్టడమే కాకుండా.. అవినీతి ఎక్కువైందనే విమర్శలు చేయడం కలకలం రేపుతోంది. అన్న కృష్ణదాస్‌కు కౌంటర్ వేశారని కొందరు భావిస్తుంటే.. ఆయన కామెంట్స్ ప్రభుత్వానికి , పార్టీకి మేలు చేస్తాయా.. కీడు కలిగిస్తాయా అని మరికొందరు ప్రశ్నిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం పనితీరు.. తాజా మంత్రివర్గ కూర్పు.. వైసీపీ అవలంభిస్తున్న విధానాలకు కాస్త దూరంగా జరిగి.. మంత్రి ధర్మాన మాట్లాడినట్టు భావిస్తున్నారు. కులం, మతం చూసి జనం ఓట్లేయబోరన్న ప్రసాదరావు గత ప్రభుత్వాలు బీసీలను ఓటు బ్యాంకుగానే ఉపయోగించుకున్నాయని వైసీపీ అగ్రనేతలు ఇటీవల కాలంలో తరచూ చెబుతూ వస్తున్నారు. అక్కడితో ఆగితే బాగోదనుకున్నా ఏమో.. నిజాయితీ కలిగిన పాలనకే విలువ ఉందని.. ఆ దిశగా ప్రభుత్వాన్ని, పార్టీని తీసుకెళ్లాలని ధర్మ సూక్తులు చెప్పారు ధర్మాన. ఈ కామెంట్స్‌తో సొంత పార్టీవాళ్లనే ఇబ్బందుల్లోకి నెట్టారని కొందరి అభిప్రాయంగా ఉందట. సొంతపార్టీని ధర్మాన ప్రసాదరావు పొగిడారా..? తిట్టారా..? ఈ సందర్భంగా ధర్మాన ప్రసాదరావు ఉదహరించిన అంశాలూ చర్చగా మారాయి. ఒడిశా సీఎం నవీన్ పట్నాయక్, కేరళ సీఎం విజయన్, బెంగాల్ సీఎం మమత, బీహార్ సీఎం నితీష్ కుమార్, ఆప్ పంజాబ్ విజయాలను ప్రస్తావించారు. కానీ? సొంత ప్రభుత్వానికి ఆ జాబితాలో చోటు ఇవ్వలేదు. దీంతో ప్రసాదరావు తిట్టారో పొగిడారో అర్థం కావడం లేదని చెవులు కొరుక్కుంటున్నాయి పార్టీ వర్గాలు. ప్రజలు కోరుకోవడం వల్లే తనకు మంత్రి పదవి ఇచ్చారని సెలవిచ్చిన ప్రసాదరావు.. కేబినెట్‌లో చోటు కోసం ఏనాడూ సీఎంను అడగలేదని.. ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించనూ లేదని తెలిపారు. మొత్తానికి పార్టీ అధిష్ఠానం చెబుతున్న మాటలకు.. మంత్రిగా ధర్మాన చేస్తున్న కామెంట్స్‌కు ఎక్కడా పొంతన కుదరడం లేదు. దీంతో రానున్న రోజుల్లో ఇంకెన్ని బాంబులు పేలుస్తారో అనే ఆసక్తి పార్టీ శ్రేణుల్లో నెలకొందట.

# వైసీపీలో భగ్గుమంటున్న విబేధాలు

విజయవాడ, ఏప్రిల్ 19, ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మంత్రి వర్గాన్ని విస్తరించి వారం రోజుల పైనే అయింది. కొత్త మంత్రులు బాధ్యతలు స్వీకరించారు. పవర్' ను పవర్'తో పాటు వచ్చిన కొత్త వైభోగాలను ఎంజాయ్ చేస్తున్నారు. అయితే, మరోవంక మంత్రులు, మాజీల మధ్య యుద్ధం నడుస్తోంది. మంత్రివర్గ విస్త'రణం'తో పాతకొత్త మంత్రుల మధ్య, మొత్తంగా అధికార వైసీపీలో రగిలిన, రాజకీయ మంటలు మంత్రం నివురు గప్పిన నిప్పులా భగ్గుమంటూనే ఉన్నాయి. నిజానికి, రోజు రోజుకు హీట్ పెరుగుతున్నట్లే కనిపిస్తోంది. శ్రీకాకుళం నుంచి చిత్తూరు వరకు అధికార పార్టీలో, పాతకొత్త మంత్రుల మధ్య పార్టీ రెండుగా చెల్లిపోయింది. ఏ వర్గానికి ఆ వర్గం తగ్గేదేలే' అన్నట్లుగా వ్యహరిస్తోది. ఒక్క మాటలో చెప్పాలంటే, అధికార పార్టీలో అగ్గి రాజుకుంది. భగ్గుమనేందుకు సిద్దంగా ఉంది. నిజానికి, పార్టీలోనే కాదు, అన్నదమ్ముల మధ్య మంత్రి పదవుల కుండమార్పిడి కొత్త చిక్కులు తెచ్చి పెట్టింది. శ్రీకాకుళం జిల్లా రాజకీయాల్లో ధర్మాన సోదరులు గతంలో అపూర్వ సోదరులుగా ఉన్నరని అనలేము కానీ, ఇప్పుడు ఆగర్భ శత్రువులుగా మారారు అనేది మాత్రం నిజం అంటున్నారు. ఇద్దరి మధ్య మంత్రివర్గ విస్తరణ చిచ్చు పెట్టింది. చివరకు అన్నదమ్ముల మధ్య మాటలు కూడా 'కట్' అయ్యాయనే టాక్ వైసీపీలో వినిపిస్తోంది. మంత్రివర్గ విస్తరణకు ముందు, అన్న ధర్మాన కృష్ణ దాస్, రెవిన్యూ శాఖ మంత్రి. ముఖ్యమంత్రి జగన్ రెడ్డి దగ్గర మంచి మార్కులే తెచ్చుకున్నారు. అయినా ,విస్తరణ తర్వాత మంత్రి పదవితో పాటుగా, రెవిన్యూ శాఖ కూడా బ్రదర్ ధర్మాన ప్రసాద రావుకు దక్కింది. అయితే రెవిన్యూ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన మొదటి రోజునే రెవిన్యూ శాఖలో అవినీతి పేరుకు పోయిందని,ధర్మాన చేసిన వ్యాఖ్య ఇప్పుడు కలకలం సృష్టిస్తోంది. ఆయన, ఏ ఉద్దేశంతో ఈ వ్యాఖ్య చేశారో ఏమో కానీ మాజీ మంత్రి అన్న కృష్ణ దాస్' పైనే ధర్మాన అవినీతి ముద్ర వేశారనే ప్రచారం జరుగుతోంది. ఈ విషయంలో కృష్ణ దాస్ సైలెంట్'గానే ఉన్నా, ఇటు అధికార పార్టీలోఅటు అధికార వర్గాల్లో మాత్రం, మంత్రి ధర్మాన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. ముఖ్యంగా రెవిన్యూ ఉద్యోగులు, ఉద్యోగ సంఘాలు కొత్త మంత్రి వస్తూవస్తూనే తమ శాఖ ఉద్యోగులపై అవినీతి ముద్ర వేయడం ఏమిటని,ప్రశ్నిస్తున్నారు. రెవిన్యూ సర్వీసెస్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు కొంత సౌమ్యంగానే అయినా, 'అన్నీ' తెలిసిన ధర్మాన తమను అవినీతి పరులు అనడం ఏమిటన్నారు. ఈ రాష్ట్రంలో నిజాయితీగా పని చేసే శాఖ ఏదైనా ఉందంటే అది రెవిన్యూ శాఖే అని చెప్పుకొచ్చారు. పరిస్థితులు గతంలోలాగా లేవని గుర్తిస్తే, గతంలో ఉమ్మడి రాష్ట్రంలో రెవెన్యూ మంత్రిగా పనిచేసిన ధర్మానకు చురకలు అంటించారు. అదలా ఉంటే, ధర్మాన వ్యాఖ్యలు రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతున్నాయి. శ్రీకాకుళం జిల్లాలోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగానూ ధర్మాన వ్యాఖ్యలు అధికార పార్టీలో దుమారం రేపుతున్నాయి. ప్రభుత్వంలో అత్యంత కీలకమైన రెవెన్యూ శాఖ అవినీతి పేరుకుపోయిందని స్వయంగా ఆ శాఖ మంత్రే, 'కితాబు' ఇస్తే ఇక ప్రభుత్వం తల ఎక్కడ పెట్టుకోవాలని వైసీపీ నాయకులు వాపోతున్నారు. అంతే కాకుండా, ధర్మాన వ్యవహారం గుడ్డొచ్చి పిల్లను ఎక్కిరించినట్లుందని అంటున్నారు, కృష్ణ దాస్ అనుచరులు. కృష్ణ దాస్ మొదటి నుంచి వైసీపీలో ఉన్నారు. కష్టనష్టాలు అనువించారు. కానీ, ధర్మాన ప్రసాద రావు అలా కాదు. చివరి వరకు కాంగ్రెస్'లో పవర్ అనుభవించి, ఆ తర్వాత 'అన్న' పేరు చెప్పుకుని వైసీపీలో చేరారు. చివరకు, అన్న పదవినే కొట్టేశారు. అయినా ఆయనపైనే అవినీతి ఆరోపణలు చేయడం ఏమిటని,

ఇది అన్నం పెట్టిన వారికి సున్నం పెట్టే ధర్మాన దుర్మార్గ నిజానికి అద్దం పడుతోందని కృష్ణదాసు అనుచరులు అగ్గిమీద్ గుగ్గిలం అవుతున్నారు. నిజానికి, రాజకీయాల్లో ధర్మాన జూనియర్ (ప్రసాద రావు) సీనియర్ అయినా, వైసీపీలో ధర్మాన కృష్ణ దాస్ సీనియర్. ధర్మాన రాష్ట్రంలో కాంగ్రెస్ కథ ముగిసే వరకు హస్తం పార్టీలోనే ఉన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో చిట్టచివరి కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి మంత్రి వర్గంలో చివరి రోజువరకు రెవెన్యూ మంత్రిగా కొనసాగారు. కృష్ణదాస్ మాత్రం 2003 ఉద్యోగం వదిలి రాజకీయ అరంగేట్రం చేసినప్పటి నుంచి వైఎస్ ఉన్నంత వరకు కాంగ్రెస్ పార్టీలో ఉన్నారు. వైఎస్ పాదయాత్రలో పాల్గొని, ఆయన వెంట నడిచారు. ఆ తర్వాత, మంచైనా, చెడైనా జగన్ రెడ్డి వైసీపీ పెట్టినప్పటినుంచి వైసీపీలో ఉన్నారు. ఈ నేపధ్యంలోనే, ఇప్పుడు ధర్మాన వచ్చి అన్నను అవమానించడం ఏమిటని, కృష్ణదాస్ వర్గం ఆగ్రహం వ్యక్త పరుస్తోంది. నిజానికి ఈ విషయం ఇప్పటికే ముఖ్యమంత్రి దృష్టికి కూడా వెళ్లిందని అంటున్నారు. జిల్లాలో అయితే, వైసీపీ ధర్మాన సోదరుల మధ్య రెండుగా చీలిపోయిందనే టాక్ జోరుగా వినిపిస్తోంది. ఇది చివరకు ఎందాక వెళుతుందో అని రాజకీవై వర్గాలో చర్చ జరుగుతోంది. అదలా ఉంటే, ఒక్క శ్రీకాకుళం జిల్లాలోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా అధికార వైసీపీలో నివురు గప్పిన నిప్పులలా ఉన్న విబేధాలు,ఎప్పుడైనా, ఎక్కడైనా భగ్గుమనే ప్రమాదం ఉందని పరిశీలకులు అంటున్నారు. నిజానికి మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణతో అధికార వైసీపీలో చోటు చెసుకున్న అంతర్గత విభేదాలు జగన్ రెడ్డి స్థాయిని, పార్టీ మీద ఆయన పట్టును తగ్గించాయని, అంటున్నారు.

# రిమ్స్ లో ప్రతీది వివాదమే

కడప, ఏప్రిల్ 19, కడప రిమ్స్ లో ప్రతీది వివాదమే అవుతోంది. తాజాగా రిమ్స్ డెంటల్ కాలేజిలో ప్రిన్సిపల్ ఛాంబరుకు సీల్ వేయడం, దాన్ని ఇవాళ పగులగొట్టడంతో పరిపాలనా పరంగా ఉన్న విభేదాలపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. అయితే ముఖ్యమైన డాక్యుమెంట్లు కోసమే ఇలా సీల్ వేశామని చెబుతున్నారు. కడప రిమ్స్ దంత వైద్యశాల ఇన్చార్జిగా డాక్టర్ సురేఖ రెండు రోజుల క్రిందట బాధ్యతలు తీసుకున్నారు. అయితే డాక్టర్ యుగంధర్ ను ఇన్చార్జి ప్రిన్సిపాల్ గా నియమిస్తూ ఉత్తర్వులు కూడా జారీ అయ్యాయి. యుగంధర్ భాధ్యతలు తీసుకునేందుకు వెళితే ప్రిన్సిపల్ ఛాంబరుకు సీల్ వేసి ఉంది. ప్రిన్సిపల్ డాక్టర్ సురేఖ ఆదేశాలమేరకే ఛాంబరుకు సీలు వేశామని అక్కడి సిబ్బంది చెబుతున్నారు. బాధ్యతలు తీసుకోవడానికి వెళితే ఆఫీసుకి సీలు వేసి ఉండటం పై డాక్టర్ యుగంధర్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఎవరు ఇలా సీలు వేయమన్నారని సిబ్బందిని ఆయన ప్రశ్నించారుదీంతో రిమ్స్ డెంటల్ కాలేజీలో తలెత్తిన వివాదం బహిర్గతం అయ్యింది. అయితే ముఖ్యమైన పత్రాలు ఉన్న గదుల తాళాలకు సీలు వేయడం మామూలేనని, శనివారం వేసిన సీలును, తాను అందుబాటులో లేకపోవడం వల్ల తన ఆదేశాల మేరకే తాళాలు పగులగొట్టి అవసరమైన పత్రాలు, రికార్డులు తీసుకున్నారని ప్రిన్సిపల్ డాక్టర్ సురేఖ చెబుతున్నారు. రిమ్స్ లో తాళాలకు సీలు వేసే విధానం ఎప్పుడూ లేదని, ఎప్పుడు ఇందుకు ఇలా చేశారంటే సరైన సమాధానం సిబ్బంది నుంచి రావడం లేదు. పటిష్టమైన సెక్యూరిటీ ఉండే రిమ్స్ లో ఒక ఛాంబరుకు ఇలా సీలు వేయడం వెనుక పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

# తిరుమల లడ్డూకు క్లీన్ కుకింగ్



తిరుమల ఏప్రిల్ 19, తిరుమల లడ్డూను భక్తులు పరమపవిత్రంగా భావిస్తారు. శ్రీవారి దర్శనానికి వెళ్లిన వారు కచ్చితంగా లడ్డూ ప్రసాదం రుచి చూడాల్సిందే. అంతే కాదు.. పొరుగు వాళ్లకూ పంచడం పద్ధతిగా వస్తోంది. తిరుమల పేరు చెబితేనే.. ముందుగా లడ్డూ గుర్తుకు వస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఈ క్రమంలో లడ్డూ తయారీ విధానంలో అధికారులు నూతన పద్ధతులను అవలంబిస్తున్నారు. తాజాగా క్లీన్ కుకింగ్ విధానంలోతిరుమల లడ్డూ మహా ప్రసాదం తయారు చేయటానికి అవసరమైన సాంకేతిక సహకారాన్ని అందజేసేందుకు కేంద్ర విద్యుత్ శాఖకు చెందిన బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ(బీఈఈ) ముందుకు వచ్చింది. ఈ మేరకు రాష్ట్ర ఇంధన శాఖ కార్యదర్శి, రాష్ట్ర ఇంధన పరిరక్షణ మిషన్(ఏపీఎస్ఈసీఎం)కు బీఈఈ డైరెక్టర్ జనరల్ అభయ్ బాక్రే ఓ లేఖ రాశారు. దేశ వ్యాప్తంగా బొగ్గు, విద్యుత్ కొరత ఏర్పడుతున్న నేపథ్యంలో భవిష్యత్ విద్యుత్ అవసరాల కోసం ఈ లక్ష్యాన్ని సాధించేందుకు తగిన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో పవిత్ర లడ్డూ మహా ప్రసాదం తయారు చేయటానికి క్లీన్ కుకింగ్ విధానం ఉపయోగించడం ద్వారా కర్బన ఉద్గారాలను పూర్తిగా తగ్గించవచ్చు. విద్యుత్ బిల్లుల కోసం టీటీడీ ఏటా రూ.40 కోట్లు వెచ్చిస్తోంది. ఇంధన సామర్థ్య చర్యలద్వారాఇందులో రూ.4 కోట్ల నుంచి రూ.5 కోట్ల వరకు వ్యయాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకుంటోంది. టీటీడీలో ఇది వరకు రోజుకు 34 లక్షల గ్యాలన్ల నీటిని వినియోగిస్తుండగా, ఇప్పుడు అది 44 లక్షల గ్యాలన్లకు చేరింది.

# పొలం పనుల్లో మాజీ డిప్యూటీ సీఎం

విజయనగరం, ఏప్రిల్ 19, పదవి పోయింది. పరపతీ పోయింది. పరువూ పోయింది. పనిలేక ఖాళీగా ఉంది. ఏం చేస్తాం.. ఎన్నెన్నో అనుకుంటాం.. అన్నీ అయితాయా ఏం.. అంటూ దిగాలుగా ఉంటోంది. ఊరికే ఉంటే ఏమీ తోచదుగా. ఖాళీగా ఉంటే అందరికీ లోకువేగా. అసలే, కరెంట్ కోతలు.. విసనకర్రతో ఊపుకొని ఊపుకొని.. విసుగొచ్చినట్టుంది. కాసేపు అలా పొలంబాట పట్టింది. గతంలో తాను ఏపీకి ఉప ముఖ్యమంత్రిని అనే విషయం పక్కన పెట్టేసింది. ఆడుతూ పాడుతూ పని చేస్తూ.. తోటలో కూరగాయలు కోస్తూ.. గృహిణిగా బాధ్యతలు నిర్వర్తించారు మాజీ మంత్రి పుష్ప శ్రీవాణి. ఆ ఫోటోలను స్వయంగా ఆమే సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో ఆ పిక్స్ వైరల్ అయ్యాయి.

## కోనసీమలో 39 మంది ఎంపీటీసీలు రాజీనామా

అమలాపురం, ఏప్రిల్ 19,ఏపీలో మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ, కొత్త జిల్లాల ఏర్పాటు రాజకీయ రచ్చకు తెరలేపుతున్నాయి. నిన్న మొన్నటి మంత్రి పదవి రాని అసంతృప్త ఎమ్మెల్యేలను పార్టీ అధిష్టానం ఎలాగో బుజ్జగించింది. తాజాగా కొత్త జిల్లాల ఏర్పాటుతో మరోసారి అసంతృప్తులు రచ్చకెక్కేలా కనిపిస్తున్నాయి. కోనసీమ జిల్లాకు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరు పెట్టాలన్న తమ డిమాండ్ ను ప్రభుత్వం పట్టించుకోలేదన్న సాకు చూపి పదుల సంఖ్యలో పార్టీకి మూకుమ్మడి రాజీనామాలు చేశారు. రాజీనామాల్లో భాగంగా కోనసీమ జిల్లా రాజోలుకు చెందిన ఎంపీటీసీ నెల్లి దుర్గాప్రసాద్ సహా 38 మంది నేతలు పార్టీకి రాజీనామాలు సమర్పించారు. ఈ సందర్భంగా నెల్లి దుర్గాప్రసాద్ మీడియాతో మాట్లాడుతూ.. కోనసీమ జిల్లాకు అంబేద్కర్ పేరు పెట్టాలని జిల్లా నుంచి పెద్దఎత్తున ప్రభుత్వానికి వినతులు వెళ్లాయని, తమ ప్రతిపాదనకు పార్టీ గౌరవం ఇవ్వకపోవడంతో పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. అలాగే దళితపేటల్లోని పార్టీ శ్రేణులతో కూడా రాజీనామాలు చేయిస్తామన్నారు. ఈ రాజీనామాలపై వైసీపీ అధిష్టానం ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి.

## కాబోయే భర్త గొంతు కోసింది

### బాధితుడి పరిస్థితి విషమయం

అనకాపల్లి కళ్లు మూసుకుంటే సర్ ప్రైజ్ ఇస్తానం టూ.. ఓ యువతి యువకుడిపై కత్తితో దాడి చేసింది.ఈ ఘటనలో యువకుడి పరిస్థితి విషమంగా ఉంది.అనకాపల్లి జిల్లా రావికమతం మండలంలోని కొమ్మలపూడి సాయిబాబా కొండపై దారుణం జరిగింది. యువకుడిని చాకుతో గొంతు కోసి, హత్యాయత్నం చేసింది. యువకుడి పరిస్థితి విష మంగా ఉండటంతో బాధితుడిని అనకాపల్లి ఆస్పత్రికి తరలించారు. ఇష్టం లేని పెళ్లి కుదర్చడంతో యువతి ఈ ఘాతుకానికి పాల్పడినట్లు తెలుస్తోంది. రామునాయుడు అనే యువకుడు హైదరాబాద్ సీఎస్ఐఆర్ లో పరిశోధకుడిగా పనిచేస్తున్నాడు. అతనికి రావికమతం మండలంలోని కొమ్మలపూడి గ్రామానికి చెందిన యువతితో నిశ్చితార్థం అయింది. వచ్చే నెల 29 న వీరికి పెళ్లి చేసేందుకు పెద్దలు నిర్ణయించారు. ఈ క్రమంలో రామునాయుడు ఇటీవల హైదరాబాద్ నుంచి విశాఖకు వచ్చాడు. అనంతరం యువతి ఇంటికి వెళ్లాడు. ఇదే సమయంలో మాట్లాడాలంటూ యువకు డిని యువతి కొండపైకి తీసుకెళ్లింది. నీకు ఒక సర్?ప్రైజ్ ఇస్తాను..కళ్లు మూసుకోమని చెప్పింది. యువతి మాటలు నమ్మిన రామునాయుడు కళ్లు మూసుకున్నాడు.వెంటనే యువ తి తనవెంట తెచ్చుకున్న చాకుతో యువకుడి గొంతు కోసింది. ఈ పెళ్లి చేసుకోవడం తనకు ఇష్టం లేదని, అందుకే ఈ ఘటనకు పాల్పడినట్లు యువతి చెప్పినట్లు పోలీసులు వెల్లడించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. వివిధ కోణాల్లో విచారణ చేపడుతున్నారు.

## బాబు కోసం రాజకీయ సన్యాసం

అనంతపుర ఏప్రిల్ 19, జేసీ ప్రభాకర్‌రెడ్డి. టీడీపీ ఫైర్‌బ్రాండ్ లీడర్. రాజకీయాల్లో ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్నారు. స్ట్రాంగ్ లీడర్‌గా రాటు దేలారు. కేసులు, కుట్రలు, దాడులకు భయపడలేదు. వైసీపీ బెదిరింపులకు వెనకడుగు లేదు. తాడిపత్రి మున్సిపల్ పీఠం దక్కించుకొని.. బస్తీ మే సవాల్ అంటూ తొడగొట్టి తఢాకా చూపించారు. అలాంటి బలమైన నాయకుడు సడెన్‌గా రాజకీయాల నుంచి వైదొలుగుతానంటూ ప్రకటించి కలకలం రేపారు. ఇంతకీ జేసీ ఎందుకు రాజకీయ సన్యాసం తీసుకుంటానన్నారు? అసలేం జరిగింది?ఎమ్మెల్యే ఉషశ్రీ చరణ్ మంత్రి అయ్యారు. కళ్యాణదుర్గంలో భారీ స్వాగత ర్యాలీ నిర్వహించారు. ఆ బలప్రదర్శనలో అరాచకం జరిగింది. పాపం.. 7 నెలల పసికందు చనిపోయింది. మంత్రి గారి ర్యాలీ అంటూ పోలీసులు వాహనాలను అడ్డుకోవడంతో.. చికిత్స అందక ఆ చిన్నారి మృత్యువాత పడిన ఘటన తీవ్ర కలకలం రేపింది. బాధిత కుటుంబ సభ్యులు న్యాయం కోసం ఆందోళన చేశారు. వారికి మద్దతుగా అన్ని వర్గాల ప్రజలు ముందుకొచ్చారు. అయినా, మంత్రి ఉషశ్రీలో చలనం లేకుండా పోయింది. కనీసం పరామర్శకు కూడా రాలేదు. దీంతో, ఆ పసికందు మృతికి న్యాయం చేయాలంటూ ఆ కుటుంబానికి మద్దతుగా స్థానిక టీడీపీ నేతలు నిరసన తెలిపారు. అంతే, జస్ట్ న్యాయం కోసం డిమాండ్ చేసిన పాపానికే.. ఆ టీడీపీ నాయకుడిపై రౌడీషీట్ తెరిచారు పోలీసులు. ఇదేమి రాజ్యం.. ఇదేమి పోలీసుల అరాచకం అంటూ అంతా మండిపడుతున్నారు. ప్రజా సమస్యలపై పోరాడే వాళ్లపై కేసులు, రౌడీషీటర్ కేసు నమోదు చేస్తే భయపడేది లేదని టీడీపీ మాజీ ఎమ్మెల్యే, తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి తేల్చిచెప్పారు. కల్యాణదుర్గంలో పసిపాప మృతి విషయంలో న్యాయ విచారణ జరిపించాలని ప్రకాశ్‌నాయుడు నిరసన తెలిపితే అతనిపై రౌడీషీట్ తెరుస్తారా? అని ప్రశ్నించారు. అనంతపురంలో చంద్రదండు రాష్ట్ర అధ్యక్షుడు ప్రకాశ్‌నాయుడి ఇంటికెళ్లి పరామర్శించారు. ఇలాంటి కేసులకు భయపడేది లేదని కార్యకర్తల్లో ధైర్యం నింపడానికి మరింత పని చేస్తానన్నారు. ఈ సందర్భంగా జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆసక్తికర కామెంట్స్ చేశారు. చంద్రబాబు సీఎం అయ్యాక రాజకీయ సన్యాసం తీసుకుంటానని చెప్పారు. ఈ రాజకీయాలతో విసుగు చెందానని అన్నారు. ప్రజల సంక్షేమం కోసం ఎన్జీవో ప్రారంభించి సేవా కార్యక్రమాలు చేస్తానని జేసీ ప్రకటించారు.

## మైనర్ బాలిక అత్యాచార కేసులో పది మంది ఆరెస్టు

### 80 మంది నిందితుల గుర్తింపు

గుంటూరు గుంటూరు జిల్లా పెరేచర్ల మైనర్ బాలిక అత్యాచార సంఘటనలో పోలీసులు పురోగతి సాధించారు. ఏఎస్పీ సుప్రజ కేసు వివరాలు వెల్లడించారు. మైనర్ బాలిక అత్యాచార సంఘటన పై 80మంది నిందితులను గుర్తించాం. ఈ ఘటనలో మరో 10మంది నిందితులను అరెస్ట్ చేశామని అన్నారు.మరికొంత నిందితులు పరారీలో ఉన్నారు. పరారీ ఉన్న వారి కోసం గాలింపు చర్యలు చేయడుతున్నాం. ఈ కేసులో నిందితుల వద్ద నుంచి ఒక కారు 53సెల్ ఫోన్లు 3ఆటోలు 3 బైకులు స్వాధీనం చేసుకున్నాం. నిందితుల విషయంలో ఎవరిని వదిలి పెట్టే ప్రసక్తి లేదని ఆమె అన్నారు.గతంలో హోం గార్డు గా విధులు నిర్వహించి మానివేసిన జేస్సింత.హేమలత మైనర్ బాలిక ను వ్యభిచారం చేయించారు. ఈ కేసులో ఒక నిందితుడు లండన్ లో ఉన్నాడు. నిందితుల కోసం విజయవాడ,హైదరాబాద్,కాకినాడ,నెల్లూరు పలు ప్రాంతాల్లో గాలించి అరెస్ట్ చేశామని ఎఎస్పీ అన్నారు. నిందితులైన వారిలో కొంత మంది జైలు శిక్ష పడింది. ఈ కేసులో ఈ మధ్య రాజకీయ నేతల ప్రమేయం ఉందన్న విషయం వాస్తవం కాదు. కొంత మంది నిందితుల ను ఫోన్ చేసి డబ్బులు కోసం జెస్సింత.హేమలత బెదిరిస్తున్నారని మా దృష్టికి వచ్చిందని సుప్రజ వెల్లడించారు. వారి పై దర్యాప్తు చేస్తున్నాము.నిందితులు జైలు నుంచి బెయిల్ పై బయటకు వచ్చారు. అరెస్ట్ చేసిన నిందితులను కోర్టులో ప్రవేశపెడతామని ఆమె వెల్లడించారు.

## ఉందిగా జాగా...వేసేయ్ పాగా

### స్మశానాలను వదలని కేటుగాళ్లు

విశాఖపట్టణం, ఏప్రిల్ 19, విశాఖలో పలు మురుగు కాలువలు ప్రస్తుతం కనపడడం లేదు. వీటిల్ని విశాఖలో గెడ్డ లు అంటారు. గతంలో ఈ గెడ్డలపై కొన్ని చోట్ల షెడ్ల లాంటి నిర్మాణాలు ఉండేవి, కానీ ప్రస్తుతం షెడ్ల దశ దాటి పెద్ద పెద్ద భవంతులునిర్మితమవుతుండడంతో అసలు అవి ఎక్కడ ఉన్నాయో వెతకాల్సిన పరిస్థితి అధికారులకు వచ్చింది. ఒక్క గెడ్డలే కాదు, కొన్ని చెరువులు కూడా వాటి రూపు రేఖలను కోల్పోయాయి. ఇక స్మశానాల సంగతి సరేసరి, స్మశానల్లో కూడా ఇల్లు వెలుస్తున్నాయి. దీంతో వీటన్నింటికి చెక్ పెట్టాలని నిర్ణయించారు అధికారులు. అందుకోసం కొత్త ఆడిట్ వ్యవస్థను రూపొందించారు. ఆ వ్యవస్థ ఏంటి, ఎలా పనిచేయబోతోందో పూర్తి వివరాలను తెలుసుకుందాం..విశాఖ లో ఇప్పడని కాదు కానీ మొదటినుంచి భూమి విలువ చాలా ఎక్కువ. ఒకవైపు సముద్రం, మరోవైపు ఎత్తైన కొండ ప్రాంతాల మధ్య ఉండడంతో సాధారణంగానే భూ విస్తీర్ణం చాలా తక్కువ. దీంతో భూములకు విపరీతమైన డిమాండ్ ఉంటుంది. ఇక ఈ మధ్య ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పరిపాలనా రాజధానిగా కూడా చేస్తామన్నారు కాబట్టి ఇంకాస్త డిమాండ్ పెరిగింది. భూములకు అలా విలువ పెరగడంతో ఆక్రమణలు పెరిగిపోయాయి. అవి ప్రైవేట్ స్థలాల ను దాటి ప్రభుత్వ స్థలాలను సైతం కబ్జా చేసే పరిస్థితి ఎప్పటినుంచో ప్రారంభం అయింది. తాజాగా ఆ వ్యవహారాలు మరింత ఊపందుకున్నాయి. ఖాళీ ప్రాంతం కనిపిస్తే చాలు అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయి. కొన్నిచోట్ల ప్రైవేటు స్థలాలను ఆనుకొని ఉన్న ప్రభుత్వ స్థలాలపై కన్నేసి తమ స్థలాల్లో కలిపేసుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితి విశాఖ శివారు ప్రాంతం అంతా ఉంది. మిగతా ప్రాంతాలకంటే ఇప్పుడు ఎండాడ రెవెన్యూ గ్రామంలో ఇలాంటి ఫిర్యాదులు ఎక్కువ అందుతున్నాయి. ఇక్కడ చెరువులు, గెడ్డలు ఆక్రమణకు గురవుతున్నాయి. సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం చెరువుల్లో నిర్మాణాలు చేపట్టకూడదు. ఎండాడలో మాత్రం ఇందుకు భిన్నమైన పరిస్థితి కనిపిస్తోంది.జీవీఎంసీ పరిధి ఎండాడ సర్వే నంబరు 67లోని చెరువులో ఏకంగా సిమెంటు రోడ్ల నిర్మాణాలు జరిగాయి. ఓ భవంతికి రాకపోకలకు వీలుగా చదును చేసి రోడ్డు వేశారు. భవనానికి సంబంధించిన కొంత నిర్మాణం అందులోనే ఉంది. సాధారణ రహదారిని తలపించేలా దాని స్వరూపాన్ని మార్చేశారు. నీరు నిల్వ ఉండడానికి వీలు లేకుండా మెరక చేసి మరీ రోడ్డు నిర్మించేశారు. గతంలో అనుసంధానంగా ఉండే గెడ్డల నుంచి నీరు చెరువులోకి నీరు వచ్చేది. ప్రస్తుతం అవన్నీ మూసుకుపోవడంతో పాటు మధ్యలో రోడ్డు కూడా నిర్మించడంతో చెరువు నామరూపాల్లేకుండా పోయింది. రెవెన్యూ రికార్డుల ప్రకారం మొత్తం 1.62 ఎకరాల్లో ఉండాల్సిన ఈ జలవనరుకు దక్షిణ వైపు సుమారు 480 గజాల మేర ఆక్రమణకు గురైంది. బహిరంగ మార్కెట్లో దాని ప్రస్తులు విలువ సుమారు రూ.3 కోట్ల వరకు ఉంటుంది. ఇదే చెరువులో 13 సెంట్ల స్థలంపై కల్వర్టు కట్టి రోడ్డు నిర్మించుకోవచ్చని గతంలో కలెక్టరు అనుమతించారు. అయితే నిబంధనలకు విరుద్ధంగా నీరు ప్రవహించడానికి వీలు లేకుండా కీర రాళ్లు, మట్టితో కప్పేయడంతో చెరువు మరింత బక్కచిక్కింది. దీంతో అక్కడ ఇపుడు ఇక్కడ నీరు వెళ్లేందుకు వీలుగా కల్వర్టునిర్మాణం జరగలేదు. ఇటీవల రెవెన్యూ అధికారులు ఈ చెరువు స్థలం ఆక్రమణకు గురైనట్లు గుర్తించారు.

అందులో సుమారు పది సెంట్లలో నిర్మాణాలున్నాయని స్వయంగా భీమిలి ఆర్డీవో తెలిపారు. ఇటీవల దీనిపై పలు ఆరోపణలు రావడంతో కలెక్టర్ విచారణకు ఆదేశించారు. దీంతో అక్రమాలు వెలుగు చూశాయి.దీంతో చెరువులు, గడ్డలు, స్మశానల తో పాటు ప్రభుత్వ భూముల విషయంలో సరైన ఆడిటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని జిల్లా అధికార యంత్రాంగం నిర్ణయించింది. క్షేత్ర స్థాయి సిబ్బంది నిరంతరం వీటిని ప్రత్యక్షంగా సందర్శించే విధంగా కార్యాచరణను రూపిందించింది. స్థానిక విఆర్వో, ఎమ్మార్వో లకు ఈ బాధ్యత అప్పగించింది. ఆయా ప్రాంతాల్లో ఉండే రెవిన్యూ క్షేత్ర సిబ్బంది రోజూ ఏదో ఒకసమయంలో వాళ్ళ పరిధిలోని ప్రభుత్వ భూములను సందర్శించాలి. వారానికి ఒకసారి వీటి స్థితిగతులపై నివేదిక ఇవ్వాలి. ఈ తరహా ఓరియెంటెషన్ ను సిబ్బంది లో నింపడానికి ప్రత్యేక శిక్షణాతరగతులను నిర్వహించాలని నిర్ణయించినట్టు అధికారులు తెలుపుతున్నారు.ఈ చెరువులు, గెడ్డలు, స్మశానాలు అక్రమించుకుంటున్న వారిలో ఎక్కువగా అధికార పార్టీ నేతలతో పాటు అన్ని పార్టీల నేతలు ఉండడంతో వీటిపై ఇక నిరంతర పర్యవేక్షణ లేకపోతే వీటిని కాపాడడం సాధ్యం కాదన్న ఆలోచనకు వచ్చారు అధికారులు. ఈ నేపధ్యంలోనే క్షేత్ర స్థాయి పర్యవేక్షణ కమిటీలు వేసి అన్ని స్థాయిల్లో నిరంతరం మోనిటర్ చేయాలని తలపెట్టారు.

## పారదర్శకంగా స్టేట్ లర్నింగ్ అచీవ్మెంట్ (శ్లాయిం) సర్వే పరీక్ష నిర్వహించాలి

**జిల్లాలో 401 పాఠశాలలో నాసా పరీక్ష..**
**జిల్లావ్యాప్తంగా 11వేల 115 మంది విద్యార్థులు హాజరవుతారు..**
**4,6,8 తరగతి విద్యార్థులకు సామర్థ్య పరీక్ష..**
**??సమగ్ర శిక్ష జిల్లా పథక అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్ రెడ్డి..**

బద్వేలు జిల్లాలోని 401 పాఠశాలలో స్టేట్ లర్నింగ్ అచీవ్మెంట్ సర్వే (ఎస్ఎల్ఏఎస్) పరీక్షను 4, 6, 8 వ తరగతి విద్యార్థులకు ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు లేకుండా పారదర్శకంగా ఈ నెల 21వ తేదీన నిర్వహించాలని సమగ్ర శిక్ష జిల్లాపథక అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్ రెడ్డి ఆదేశించారు. సిఎస్ఐ ఉన్నత పాఠశాలలో క్లస్టర్ రిసోర్స్ పర్సన్ (సిఆర్పీ) లకు ఒకరోజు శిక్షణా కార్యక్రమం డిసిఈబి సెక్రటరీ కె. శోభారాణి ఆధ్వర్యంలో ఎస్ఎల్ఏఎస్ పరీక్షపై శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ.. సపోర్టింగ్ ఆంధ్ర లెర్నింగ్ ట్రాన్స్ఫర్మేషన్ ప్రోగ్రాం (ఎస్ఎల్ఏటి) లో భాగంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వన్, స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్, ఎడ్యుకేషన్ ఇనిషియేటివ్ తో కలసి ఏప్రిల్ 21 వ తేది స్టేట్ గవర్నమెంట్ సర్వే నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. అంతేకాకుండా 4,6,8 తరగతి విద్యార్థులకు సామర్థ్యాన్ని పరీక్షించేందుకు పరీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పరీక్ష నిర్వహించే రోజున ఎస్ఎల్ఏఎస్ పరీక్ష గల పాఠశాలకు ఉదయం నుంచి సాయంత్రం వరకు పాఠశాల నిర్వహించాలని, సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కు ముందుగానే తెలియజేయాలని సూచించారు. పరీక్ష జరుగు పాఠశాలలో ఎవ్వరికీ, ఒక్క ఉపాధ్యాయుడికి కూడా 21వ తేదీన సెలవు మంజూరు చేయరాదని సూచించారు. ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్ లు పరీక్షను ఖచ్చితంగా నిర్వహించాలని ఎక్కడ విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, పాఠశాలకు ఇబ్బంది కలగకుండా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు లేకుండా నిర్వహించాలని ఉపదేశించారు. పరీక్ష జరిగే 401 పాఠశాలలో జిల్లా స్థాయి విద్యా శాఖ అధికారులు తనిఖీ చేస్తారని ఆ సమయంలో ఎవరైనా పొరపాటు చేసినట్లయితే వారిపై చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. అనంతరం డిసిఈబి సెక్రటరీ శోభారాణి, సమగ్ర శిక్ష అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ ధనలక్ష్మి , ఎడ్యుకేషనల్ ఇనిషియేటీవేస్ దత్తాత్రేయ లు ఎస్ఎల్ఏఎస్ పరీక్ష పై వివరంగా వివరించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష అసిస్టెంట్ అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ రామాంజనేయులు రెడ్డి, అసిస్టెంట్ ఆల్టర్నేటివ్ స్కూల్ కోఆర్డినేటర్ దశరథరామిరెడ్డి, డిసిఈబి కార్యాలయ సిబ్బంది ప్రసాద్, ఆర్పి లు, సిఆర్పీ లు తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారికి వైభవంగా కుంభోత్సవం



శ్రీశైలం ఏప్రిల్ 19 శ్రీశైలం దేవస్థానం లో లోక కల్యాణం కోసం శ్రీ భ్రమరాంబాదేవి వారికి మంగళవారం రోజు సంప్రదాయబద్ధంగా వార్షిక కుంభోత్సవం జరిపించబడుతోంది. ప్రతీ సంవత్సరం చైత్రమాసంలో పౌర్ణమి తరువాత వచ్చే మంగళవారం రోజు అమ్మవారికి పాతికబలిని సమర్పించేందుకు ఈ విశేష ఉత్సవం నిర్వహించడం సంప్రదాయం.ఈ సంవత్సరం పౌర్ణమి తరువాత మంగళవారం ముందుగా రావడంతో ఈ రోజు కుంభోత్సవం జరిపించబడుతోంది. ఈ ఉత్సవంలో గుమ్మడికాయలు, కొబ్బరికాయలు, నిమ్మకాయలు, అన్నపురాశి మొదలైనవి. అమ్మవారికి సాత్విక బలిగా సమర్పించడం సంప్రదాయం. మంగళవారం ఉదయం జరిగిన కార్యక్రమములో కార్యనిర్వహణాధికారి ఎస్. లవన్న, ధర్మకర్తల మండలి అధ్యక్షులు రెడ్డివారి చక్రపాణిరెడ్డి, సభ్యులు శ్రీమతం విరూపాక్షయ్యస్వామి, జంగం సుజాతమ్మ, గురుమహంత్ మహేష్, జి. నరసింహారెడ్డి,ఎం. విజయలక్ష్మీ సుబ్బరాయుడు,ఎ. మురళి, మేరాజోత్ హనుమంతనాయక్, ప్రత్యేక ఆహ్వానితులు కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి పాల్గొన్నారు.మొత్తం మీద ఈ ఉత్సవంలో దాదాపు అయిదు వేల గుమ్మడికాయలు, రెండువేలకు పైగా కొబ్బరికాయలు, సుమారు లక్షకు పైగా నిమ్మకాయలు మరియు వండిన అన్నం (కుంభం) అమ్మవారికి కలి సమర్పించడం జరుగుతోంది.ఈ ఉత్సవంలో అధిక పరిమాణంలో పసుపు, కుంకుమనులను అమ్మవారికి సమర్పిస్తారు. ఈ పసుపు, కుంకుమలు సమర్పణకే "శాంతి ప్రక్రియ" అని పేరు. ఇక స్థానిక వ్యాపార సంఘం వారు గుమ్మడికాయలు, కొబ్బరికాయలు, వండిన అన్నం. అమ్మవారికి సాత్మిక బలిగా సమర్పిస్తున్నారు.ఈ ఉత్సవానికి సాకలలికి గాను పలువురు భక్తులు నిమ్మకాయలను, గుమ్మడికాయలను,విరాళంగా సమర్పించడం జరిగింది.కాగా కుంభోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం రోజు ఉదయం ప్రాతఃకాల పూజల అనంతరం శ్రీ అమ్మవారికి ఆలయ అర్చకులు నవావరణపూజ, త్రిశతి, ఖడ్గమాల, అష్టోత్తర కుంకుమ పూజలను, పారాయణలను నిర్వహించారు. ఆచారాన్ని అనుసరించి ఈ పూజలన్నీ అమ్మవారికి ఏకాంతంగా జరిపించబడ్డాయి.తరువాత అమ్మవారి ఆలయంలో రజకునినేత ప్రత్యేక ముగ్గు వేయించబడి శ్రీ చక్రం వద్ద విశేషపూజలు చేయబడ్డాయి.తరువాత సాత్మికబలికి సిద్ధం చేయబడిన కొబ్బరికాయలు, గుమ్మడికాయలకు పూజాదికాలుజరిపించబడ్డాయి. అనంతరం అమ్మవారికి కొబ్బరికాయలు, గుమ్మడికాయలు సమర్పించబడ్డాయి. ఈ మొదటి విడత సాత్విక బలి సమర్పణకు తరువాత హరిహరరాయగోపుర ద్వారం వద్ద గల మహిషాసురమర్దిని అమ్మవారికి (కోటమ్మవారికి) ప్రత్యేక పూజాధికాలను జరిపించి సాత్మికబలిగా కొబ్బరికాయలు, గుమ్మడికాయలు సమర్పించబడ్డాయి.తరువాత ఈ ఉత్సవాలలో భాగంగానే సాయంకాలం శ్రీ మల్లికార్జునస్వామివారికి ప్రదోషకాలపూజల అనంతరం అన్నాభిషేకం జరిపించబడుతుంది.స్వామివార్ల పూజల అనంతరం అమ్మవారి ఆలయానికి ఎదురుగా సింహమండపం వద్దవండిన అన్నం కుంభరాశిగా వేయబడుతుంది.తరువాత సంప్రదాయాన్ని అనుసరించి స్త్రీ వేషంలో ఉన్న పురుషుడు అమ్మవారికి కుంభహారతిని సమర్పించడంతో ఉత్సవంలోని ప్రధాన ఘట్టం ప్రారంభమవుతుంది. తరువాత రెండో విడత సాత్మిక బలి సమర్పించబడుతుంది.చివరగా అమ్మవారికి ప్రత్యేక పూజలను చేసి పిండివంటలతో అమ్మవారికి మహానివేదన చేయడం జరుగుతుంది. కాగా ఈ ఉత్సవంలో భాగంగానే గ్రామదేవక అంకాళమ్మకు కూడా ఈ ఉదయం ప్రత్యేక పూజలను నిర్వహించబడ్డాయి.

## ఘనంగా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి జన్మదిన వేడుకలు

### -నిరుపేద మహిళలకు చీరలు పంపిణీ చేసిన మేయర్

నెల్లూరు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సూచనలమేరకు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో రాజ్యసభ సభ్యులు మరియు వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి జన్మదిన వేడుకలను వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పేద మహిళలకు నగర మేయర్ పొట్లూరి స్రవంతి జయవర్ధన్ మరియు వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి చీరలు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. అత్యంత కష్టకాలంలో వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీకి, ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డికి అండగా నిలచిన గొప్ప వ్యక్తి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అని అన్నారు. భవిష్యత్తులో మరింత ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నగర అధ్యక్షులు తాటి వెంకటేశ్వర రావు, నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 26 డివిజన్ల కార్పొరేటర్లు, వైసీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## దశలవారిగా పెన్షన్లు పెంచుతాం

విశాఖపట్నం ప్రతి నెల ఒకటో తారీఖున సూర్యోద యానికి ముందే పెన్షన్ ఇస్తుంటే.. కొన్ని పత్రికలు ఐదో తేదీన ఇస్తున్నారంటూ దుష్ప్రచారం చేస్తున్నాయని డిప్యూటీ సీఎం,పంచాయతీ రాజ్, గ్రామీణాభివృ ద్ధి శాఖ మంత్రి బూడి ముత్యాలనా యుడు మండిపడ్డారు. ఈ మేరకు విశాఖలో మంత్రి మీడియాతో మాట్లా డుతూ..పత్రికల్లో వచ్చిన వార్తలు చూస్తే బాధ కలిగి మాట్లాడుతున్నా. జగన్ ఒకేసారి పెంచుతామని చెప్పలేదు. దశల వారీగా పెన్షన్ పెంచుతామని చెప్పి అలాగే పెంచుతున్నారని అన్నా రు. టీడీపీ హయాంలో పెన్షన్ కోసం నాలుగు వందల కోట్లు కేటాయిస్తే.. సీఎం జగన్ ప్రభుత్వం 1,570 కోట్లు ఇస్తోందని,టీడీపీ హయాంలో పచ్చ మీడియా ఎందుకు ప్రశ్నించలే దని అర్హతలే ప్రామాణికంగా వాలం టీరు, సచివాలయం వ్యవస్థ పని చేస్తోందని దేశంలోని ఇతర రాష్ట్రాల ప్రభుత్వాలు జగన్ పాలనను ఆదర్శంగా తీసుకుంటున్నాయని లంచం ఇస్తే టీడీపీ హయాంలో ఉద్యోగాలు ఇచ్చారని చెప్పారు. వైఎస్సార్సీపీ హయాంలో పార్టీలకు అతీతంగా.. అర్హులకు మాత్రమే సచివాలయం ఉద్యోగాలు ఇచ్చారని అన్నారు.

## 20 న జిల్లాలో కేంద్ర విద్యాశాఖ మంత్రి పర్యటన....

### జిల్లా ఎస్ఎస్ఏ పిఓ డాక్టర్ అంబవరం ప్రభాకర్ రెడ్డి వెల్లడి

బద్వేలు జిల్లాలో ఈనెల 20 వ తేదీన కేంద్ర విద్యా, నైపుణ్యాభివృద్ధి మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పర్యటించనున్నట్టు జిల్లా ఎస్ ఎస్ ఏ అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు . కేంద్ర విద్యా శాఖ మంత్రి మనబడి నాడు-నేడు లో భాగంగా జిల్లాలో పలు పాఠశాలలను మరియు గ్రామ సచివాలయం , రైతు భరోసా కేంద్రం లను పరిశీలించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. పిఓ డాక్టర్ అంబవరం ప్రభాకర్ రెడ్డి సిద్ధవటం మండలం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భాకరాపేట మరియు వెంకటేశ్వర పురం లో ని ప్రాథమికోన్నత పాఠశాలలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి వెంకట్ రామ్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఇంటర్ ఆన్ లైన్ అడ్మిషన్లు

విజయవాడ, ఏప్రిల్ 19, వచ్చే విద్యా సంవత్సరం (2022-23) నుంచి ఇంటర్మీడియట్ ప్రవేశాలను ఆన్‌లైన్‌లో నిర్వహించేందుకు ఆంధ్రప్రదేశ్ విద్యామండలి కసరత్తు చేస్తోంది. బీటెక్ తరహాలో స్టూడెంట్స్ ఆన్‌లైన్ ద్వారా నచ్చిన కాలేజిలో సీట్లను పొందే విధానం ఇంటర్ విద్యార్థులకు పెట్టాలనే డిమాండ్ నేపథ్యంలో 2020-21, 2021-22 ఆన్‌లైన్ ప్రవేశాల నిర్వహణకు నోటిఫికేషన్ ఇచ్చినప్పటికీ న్యాయస్థానం వాటిని కొట్టేసింది. దీంతో ఏ కళాశాలకు ఆ కళాశాల సీట్లను భర్తీ చేసుకున్నాయి.ఈ ఏడాది ఆన్‌లైన్ ప్రవేశాల విధానం తీసుకొచ్చేందుకు నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం, కేంద్ర విద్యాశాఖ నియంత్రణలోని ఎడ్యుకేషనల్ కన్సల్టెంట్స్ ఇండియా (ఎడ్సిల్) ప్రతినిధులు, ఇంటర్ విద్యామండలి సంయుక్త సంచాలకులతో కమిటీ ఏర్పాటు చేశారు.ఈ కమిటీ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, కళాశాలల యాజమాన్యాలతో సంప్రదింపులు జరిపి, ఆన్‌లైన్ ప్రవేశాలపై అభిప్రాయాలు సేకరిస్తుంది. స్థానిక, స్థానికేతర రిజర్వేషన్ల ఆధారంగా సీట్ల కేటాయింపులో ఉన్న ఇబ్బందులపైనా అధ్యయనం చేస్తుంది. రిజర్వేషన్లపై కమిటీ సిఫార్సుల ఆధారంగా ఏపీ ఇంటర్ విద్యామండలి ప్రభుత్వానికి నివేదిక పంపనుంది.ఆన్‌లైన్ ప్రవేశాలకు గతంలో ప్రకటించిన విధానం ప్రకారం విద్యార్థులు ఇంటర్ విద్యామండలి వెబ్‌సైట్ నుంచి కళాశాలలను ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. ఒక్కో సెక్షన్‌లో 88 సీట్లు ఉంటాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు, అందుబాటులో ఉన్న సీట్లు, పదో తరగతి మార్కుల ఆధారంగా ఆన్‌లైన్‌లో సీట్లను కేటాయిస్తారు. విద్యార్థులు ఇచ్చే ఐచ్ఛికాల్లో ఏదో ఒక కళాశాలలో సీటు కేటాయిస్తారు. మొదటి విడతలో సీటు రాకపోయినా, మొదటిసారి వచ్చిన సీటు నచ్చకపోయినా రెండో కౌన్సెలింగ్‌లో మార్చుకోవచ్చు.

## నెల్లూరులో పొలిటికల్ హీట్

నెల్లూరు, ఏప్రిల్ 19,నెల్లూరు జిల్లా రాజకీయాలు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశం అవుతున్నాయి. అధికార పార్టీ వైసీపీకి చెందిన మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ ల మధ్య ఆధిపత్య పోరు ముదిరి పాకాన పడుతోంది. వ్యవసాయ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఇటీవల కాకాణి మొదటి సారిగా నెల్లూరు జిల్లాకు రావడం, అదే రోజు 'ఆత్మీయ సభ' పేరుతో అనిల్ పోటీగా బహిరంగ సభ చేపట్టడంతో ఒక్కసారిగా నెల్లూరు రాజకీయాలు వేడెక్కాయి. ఇక మంత్రి నియోజకవర్గం సర్వేపల్లి గ్రామంలో జరిగిన ఒక ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొనేందుకు భారీ కాన్వాయ్ తో వచ్చారు అనిల్ కుమార్. అంతేకాదు సర్వేపల్లిలో అనిల్ అనుచరులు బాణాసంచా కాల్చి నానా హంగామా చేశారు. కాగా తాజాగా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఫ్లెక్సీల తొలగింపు నెల్లూరులో హాట్‌టాపిక్‌గా మారింది.ఎంపీ జన్మదినం సందర్భంగా నెల్లూరు జిల్లా అంతటా ప్రభాకర్ రెడ్డి ఫ్లెక్సీలు ఏర్పాటుచేశారు. అయితే నెల్లూరు సిటీ పరిధిలో చాలా చోట్ల వేమిరెడ్డి ఫ్లెక్సీలు తొలగించారు. అదే సమయంలో నెల్లూరు రూరల్ పరిధిలో యథావిధిగా ఫ్లెక్సీలు ఉన్నాయి. మాజీమంత్రి అనిల్ కుమార్ యాదవ్ కావాలనే ఈ ఫ్లెక్సీలు తొలగించినట్లు చర్చ నడుస్తోంది. కాగా కొన్ని రోజుల క్రితం మంత్రి కాకానీ ఫ్లెక్సీలను అనిల్ అనుచరులు తొలగించిన సంగతి తెలిసిందే. కూడా అనిల్ అనుచరులే ఈ పని చేసి ఉంటారని భావిస్తున్నారు. కాగా ఈ వ్యవహారంపై ఎంపీ వేమిరెడ్డి వర్గం సీరియస్‌గా ఉంది.

## వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అధికార పార్టీ నాయకులకు తొత్తులుగా మారకండి

### సిపిఐ. ఇన్సాఫ్ బాబా ఫక్రుద్దీన్

నంద్యాల :-. నంద్యాల లో పర్యటించిన వక్ఫ్ బోర్డు చైర్మన్ ఖాదర్ బాషా అధికారికంగా ప్రకటించా రా లేక అధికార పార్టీ నాయకులకు వక్ఫ్ బోర్డు భూములను అప్పనంగా అప్పగించేందుకు వచ్చారా. అర్థం కాకుండా పర్యటించారని అధికార పార్టీ నాయకుల ఇళ్లల్లో అధికారులతో సమావేశం ఏర్పాటు చేయడం చూస్తుంటే అధికార పార్టీ నాయకులకు తొత్తులుగా వ్యవహరించటం లా ఉందని నంద్యాల పట్టణంలో అన్యాక్రాంతమైన వక్ఫ్ బోర్డు భూములను పరిరక్షించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు. ఇన్సాఫ్ రాష్ట్రకమిటీ ఉపాధ్యక్షుడు. ఎస్. బాబా ఫక్రుద్దీన్. సిపిఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్. ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి డి శ్రీనివాసులు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కార్యదర్శి జి. సోమన్న. ఇన్సాఫ్ రాష్ట్ర సమితి సభ్యులు. ఎస్ రియాజ్. ఎస్. షరీఫ్ భాష. ఎస్ జైలన్ భాష ఒక ప్రకటనలో తెలిపారు. నంద్యాల జిల్లా పరిధిలో అనేక నియోజకవర్గాలలో వక్ఫ్ బోర్డ్ భూములు అన్యాక్రాంతమైన ఏ పార్టీ అధికారంలో ఉన్నా ఆ పార్టీ అనుచరులకు అప్పనంగా అప్పజెప్పారు నాయకులు ఆ భూములను సొంత ఆస్తులుగా దొంగ పట్టాలు సృష్టించుకుని అమ్ముకుంటున్న ప్రభుత్వ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ఉండడం వల్ల ఆ భూములన్నీ అన్యాక్రాంతమైన అని ఆరోపించారు. నంద్యాల పట్టణంలో వందలాది ఎకరాలు వక్ఫ్ బోర్డు భూములన్నీ అన్యాక్రాంతమైన యని వాటిని కాపాడాలని సిపిఐ. ఇన్సాఫ్ పార్టీల ఆధ్వర్యంలో సర్వే నెంబర్లతో సహా అనేక సార్లు ప్రభుత్వ అధికారులు విన్నవించిన దున్నపోతు మీద వర్షం పడ్డట్టు వారు పట్టించుకోక పోవడం వల్లే ఆ భూములను కాపాడేవాడు లేకుండా పోతున్నారని తెలిపారు. ఇప్పటికైనా అధికార పార్టీ నాయకులు. అధికారులు అన్యాక్రాంతమైన వక్ఫ్ బోర్డు భూములను స్వాధీనం చేసుకొని వాటి మీద వచ్చే ఆదాయ ఆర్థిక వనరులను మైనార్టీలకు సంక్షేమ పథకాలు గా అమలు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు.




## త్వరలోనే గ్రామాల్లో పర్యటిస్తాప్రతి గడపకు వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటా

### వలంటీర్ల సత్కారం సభలో మంత్రాలయం హ్యాట్రిక్ ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి





మంత్రాలయం ( విభారె) :త్వరలోనే నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో పర్యటిస్తానని మంత్రాలయం ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి పేర్కొన్నారు.. మంగళవారం మండల పరిధిలోని రాంపురం గ్రామంలోని కళ్యాణ మండపంలో నిర్వహించిన వలంటీర్ల సత్కారం సభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా ఎంపిడివో నరసింహ రెడ్డి పూలమాల వేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలు అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలని వలంటీర్లను కోరారు. అంతే కాకుండా త్వరలోనే ప్రతి గడపకు వెళ్లి సమస్యలు, ప్రభుత్వ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకుంటానని తెలిపారు. నేను గ్రామాలకు వచ్చేసరికి లబ్దిదారుల సమస్యలు పెండింగ్ లో లేకుండా చూడాలని కోరారు. దేవుడి దయ ప్రజల ఆశీస్సులతో మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందానని నాల్గవ సారి కూడా మీ అందరి సహకారంతో, ప్రజల దీవెనలతో విజయం సాధించడమే కాకుండా రాష్ట్రం లో గత ఎన్నికల్లో 151 సీట్లు వస్తే ఈ సారి ఎన్నికల్లో ఎక్కువ సీట్లలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయకేతనం ఎగురవేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యంగా వలంటీర్లు చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. వలంటీర్ల, సచివాలయ ఉద్యోగులకు జగన్ మోహన్ రెడ్డి ఖచ్చితంగా న్యాయం చేస్తాడని ప్రతి పక్షాల మాట విని ధర్నాలకు వెళ్లడం మంచి పద్ధతి కాదని హెచ్చరించారు. మాట తప్పని మడమ తిప్పని నేత జగన్ అని ఎద్దేవా చేశారు. అనంతరం సేవా రత్న, సేవా మిత్ర అవార్డులను ఎమ్మెల్యే చేతుల మీదుగా వలంటీర్ల కు అందజేసి శాలువ కప్పి సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ మండల కన్వీనర్ జి. భీమిరెడ్డి, ఇన్ చార్జ్, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు విశ్వనాథ్ రెడ్డి, ఎంపిడిఓ నరసింహ రెడ్డి, జడ్పీటీసీ గోవిందమ్మ, ఈవోపీఆర్డి నాగేష్, పీఆర్ జేఈ నర్సింహులు, ఏపివో తిమ్మారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ ఐసిడిఎస్ సూపర్ వైజర్, సర్పంచ్లు, ఎంపీటీసీ లు వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వ భూములను పరిశీలించిన ఆర్డివో మోహన్ దాస్

తుగ్గలి: మండల పరిధిలోని పలు గ్రామాలలో జీయో మైసూర్ మైనింగ్ కు సంభందించిన ప్రభుత్వ భూములను మరియు అసైన్డ్ భూములను మంగళవారం రోజున పత్తికొండ ఆర్డిఓ పరిశీలించారు. పగిడిరాయి, ఉప్పర్లపల్లి మరియు గుత్తి ఎర్రగుడి గ్రామాలలోని గల ప్రభుత్వ భూములను మరియు అసైన్మెంట్ భూములను పరిశీలించి అధికారుల ద్వారా వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహాసిల్దార్ నిజాముద్దీన్, మండల సర్వేయర్ గాధి లింగప్ప, రెవెన్యూ ఇన్స్పెక్టర్ సుధాకర్ రెడ్డి, విఆర్వో రంగన్న, ఏవో పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు




## కస్తూరిబా విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ

మద్దికేర ( విభారె) : మండల కేంద్రమైన మద్దికేర లోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల నందు మైత్రి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు రామ్మోహన్, లోక్ సత్తా పార్టీ రాష్ట్ర బీసీ నాయకుడు, మానవ హక్కులకై పోరాటం సాధించిన రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మంగళవారం రోజున 40 మంది పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థునిలకు ఎగ్జామ్స్ ప్యాడ్, జామెంట్రీ బాక్స్, పెన్స్ లను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలిక చదువు కోసం తమ ట్రస్ట్ ఎంతగానో పాటుపడుతూ ఉందని, సమాజంలో స్త్రీ పాత్ర దండలో దారం వంటిదని, రాబోయే పదో తరగతి పరీక్షలో మంచి ఉత్తీర్ణత సాధించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మద్దికేర మండలం ఎంఈఓ రంగస్వామి గారు మాట్లాడుతూ చదువు కోసం ప్రభుత్వం అనేక సౌకర్యాలు కల్పించిందని వీటిని సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత టీచర్లదే నని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక మద్దికేర , చౌక్కాసునీల్ కుమార్× మాట్లాడుతూ ఎవరైనా పేద విద్యార్థినిలు ఉంటే చదువు కోసం సహాయం చేస్తామని చెప్పారు. మా పాఠశాలలో పిల్లలకు ఎలా ఎగ్జామ్స్ ప్యాడ్ పంపిణీ చేయడం చాలా సంతోషంగా ఉందని స్థానిక ప్రిన్సిపాల్ బి. మెహబూబ్ బేగం మేడం గారు చెప్పడం జరిగినది. ఈ హా కార్యక్రమంలో కస్తూర్బా పాఠశాల అధ్యాపక అధ్యాపకేతర బృందం పాల్గొనడం జరిగినది.



## 'సర్కారువారి పాట' నుంచి ఇంట్రెస్టింగ్ అప్ డేట్!



మహేశ్ బాబు - పరశురామ్ కాంబినేషన్లో 'సర్కారివారి పాట' సినిమా రూపొందుతోంది. మైత్రీ మూవీ మేకర్స్ - 14 రీల్స్ వారు కలిసి ఈ సినిమా ను నిర్మిస్తున్నారు. ఈ సినిమా నిర్మాణంలో మహేశ్ బాబు కూడా ఒక భాగస్వామిగా ఉన్నాడు. హైదరాబాద్ .. గోవా .. దుబాయ్ .. స్పెయిన్ లలో ఈ సినిమా చిత్రీకరణను జరుపుతూ వచ్చారు. అక్కడక్కడా ఎమోషన్ ను టచ్ చేస్తూ సాగే యాక్షన్ కామెడీ ఇది. తమన్ సంగీతాన్ని సమకూర్చిన ఈ సినిమాలో మహేశ్ బాబు సరసన నాయికగా కీర్తి సురేశ్ అలరించనుంది. ఈ సినిమాలో మొత్తం ఐదు పాటలున్నాయట. ఒక పాట మినహా మిగతా పాటల చిత్రీకరణ పూర్తయినట్టుగా ఇటీవల మేకర్స్ ప్రకటించారు. ఆ ఒక్క పాట షూటింగును హైదరాబాద్ - రామోజీ ఫిల్మ్ సిటీలో ఈ రోజున మొదలుపెట్టినట్టుగా తెలుస్తోంది. ఈ పాటతో ఈ సినిమా షూటింగు పార్టు పూర్తవుతుంది గనుక గుమ్మడికాయ కొట్టేయడానికి సిద్ధమవుతున్నారు. ఈ సినిమా అప్ డేట్ లో భాగంగా ఈ పాటకి సంబంధించిన పిక్స్ ను కూడా షేర్ చేయనున్నట్టు చెబుతున్నారు. ఇది మహేశ్ ఫ్యాన్స్ కి శుభవార్త వంటిదే. నిజానికి ఈ సినిమా సెట్స్ పైకి వెళ్లి చాలా కాలమైంది. కరోనా కారణంగా .. మహేశ్ బాబు మోకాలు సర్జరీ కారణంగా షూటింగు పరమైన జాప్యం జరుగుతూ వచ్చింది. ఆ తరువాత చకచకా షూటింగును పూర్తి చేస్తూ వచ్చారు. ఈ సినిమాకి తమన్ సంగీతాన్ని సమకూర్చాడు. ఇంతవరకూ వదిలిన 'కళావతి' .. 'పెన్నీ' పాటలకు అనూహ్యమైన రెస్పాన్స్ వచ్చింది. వ్యూస్ పరంగా .. లైక్స్ పరంగా ఈ పాటలు కొత్త రికార్డులను క్రియేట్ చేస్తూ వచ్చాయి. త్వరలో మరో పాటను వదలడానికి సన్నాహాలు చేస్తున్నట్టుగా తెలుస్తోంది. బ్యాంకు స్కామ్ నేపథ్యంలో ఈ కథ నడుస్తుంది. సముద్రఖని .. వెన్నెల కిశోర్ ఈ సినిమాలో ముఖ్యమైన పాత్రల్లో కనిపించనున్నారు. మే 12వ తేదీన ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నారు. ఆ తరువాత మహేశ్ బాబు సినిమా త్రివిక్రమ్ తో ఉండనుంది. ఈ ఇద్దరి కాంబినేషన్లో వస్తున్న మూడో సినిమా ఇది. అందువలన సహజంగానే అంచనాలు ఉన్నాయి. మహేశ్ సరసన నాయికగా పూజ హెగ్డేను తీసుకున్నారు. 'మహర్షి' తరువాత ఈ జంట మళ్లీ కనువిందు చేయనుంది. త్వరలోనే ఈ ప్రాజెక్టు సెట్స్ పైకి వెళ్లనుంది.

## అందాల శ్రుతి అస్సలు టైమ్ వేస్టు చేయడం లేదే!

టాలీవుడ్ తెరకి నాజూకుదనాన్ని పరిచయం చేసిన కథానాయికగా శృతిహాసన్ ను గురించి చెప్పుకోవచ్చు. తెలుగు తెరపై వాలిన ఈ పాలపిట్టకి అభిమానులు కానివారంటూ కనిపించరు. మంచి గంధం ముక్కలాంటి ఈ అమ్మడికి మనసులు సమర్పించని వాళ్లంటూ ఉండరు. అలాంటి ఈ బ్యూటీకి తెలుగులో మంచి హిట్లు పడ్డాయి. ' గబ్బర్ సింగ్' .. 'రేసుగుర్రం' .. 'శ్రీమంతుడు' .. 'క్రాక్' వంటి సినిమాలు శ్రుతి కెరియర్లో చెప్పుకోదగినవిగా కనిపిస్తాయి. ఆ సినిమాలన్నీ కూడా ఆమె గ్లామర్ కి అద్దం పడతాయి .. అర్థం చెబుతాయి. అలాంటి శృతిహాసన్ ఆ మధ్య లవ్ లో పడిపోయి ప్రేమకంటే ఏదీ ఎక్కువ కాదనే విషయాన్ని చాటిచెబుదామనుకుంది. కానీ సినిమాలు తగ్గిపోయి ఖర్చులకు డబ్బు అవసరమయ్యేసరికి ప్రేమకి మాత్రమే కాదు .. డబ్బుకి కూడా దూరంగా ఉండలేమనే విషయాన్ని గ్రహించింది. సంపాదిస్తూనే ప్రేమను కొనసాగించాలనే ఒక పాఠాన్ని వంటబట్టించుకుని ఆ దిశగానే ముందుకు వెళుతోంది. అందువల్లనే తన ప్రేమికుడు శంతను హాజారికాతో షికార్లు కంటిన్యూ చేస్తూనే షూటింగులకు హాజరవుతోంది. ఎక్కడ ఏ మాత్రం టైమ్ వేస్టు చేయకుండా ఈ రెండింటినీ బ్యాలెన్స్ చేస్తూ వెళుతోంది. ప్రస్తుతం ఆమె చిరంజీవి షూటింగులో బిజీగా ఉంది. బాబీ దర్శకత్వంలో చిరంజీవి ఒక సినిమా చేస్తున్నారు. మాస్ యాక్షన్ ఎంటర్టైనర్ గా ఈ సినిమా రూపొందుతోంది. ఈ సినిమాకి 'వాల్తేరు వీర్రాజు' .. 'వాల్తేరు మొనగాడు' టైటిల్స్ ను పరిశీలిస్తున్నారు. తాజాగా ఈ సినిమా షూటింగులో శ్రుతి హాసన్ జాయిన్ అయింది. ఈ విషయాన్ని ఆమె స్వయంగా పోస్టు చేసింది. చిరంజీవి - శ్రుతి హాసన్ కాంబినేషన్లోని కొన్ని ముఖ్యమైన సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ వారు నిర్మిస్తున్న ఈ సినిమాకి దేవిశ్రీ ప్రసాద్ సంగీతాన్ని సమకూర్చుతున్నాడు. ఈ మధ్య తెలుగులో శ్రుతి హాసన్ 'క్రాక్' సినిమాతో హిట్ కొట్టింది. ఆ తరువాత 'వకీల్ సాబ్'లో ఏదో శాస్త్రానికి కనిపించినా అది కూడా ఆమె కెరియర్లో హిట్ గానే నమోదైంది. ఆ తరువాత ప్రభాస్ తో ఆమె 'సలార్' సినిమాకి సంబంధించిన కొన్ని షెడ్యూల్స్ ను పూర్తి చేసింది. ఇక బాలకృష్ణ 107వ సినిమాగా రూపొందుతున్న గోపీచంద్ మలినేని సినిమాలోనూ ఆమెనే కథానాయికగా. ఇలా శృతిహాసన్ వరుస సినిమాలతో సందడి చేయడానికి సిద్ధమవుతోంది. మరి వీటిలో ఏవి వసూళ్ల పరంగా రెపరెపలాడతాయో .. మాస్ ఆడియన్స్ నుంచి మార్కులను పడతాయో చూడాలి.



## క్లాస్ పీకిన రకుల్ ప్రీత్ సింగ్

టాలీవుడ్ లో స్టార్ హీరోయిన్ గా ఎదిగి బాలీవుడ్ కి చెక్కేసింది రకుల్ ప్రీత్ సింగ్.. ఇక బాలీవుడ్ లో వరుస సినిమాలతో బిజీగా ఉంది ఈ అమ్మడు. ఇటీవల వరుస ఫోటో షూట్స్ తో రచ్చ చేస్తోంది ఈ భామ. ప్రసుతం ఈ అమ్మడి చేతిలో దాదాపు అరడజనుకు పైగా బాలీవుడ్ సినిమాలు ఉన్నాయి. రకుల్ లేటెస్ట్ మూవీ రన్ వే 34. ఈ సినిమా ఏప్రిల్ 29న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో రకుల్ ఈ చిత్ర ప్రమోషన్స్ లో పాల్గొంటోంది. రన్ వే మూవీలో రకుల్ పైలట్ తాన్యా రోల్ చేస్తోంది. ఈ మూవీలో అజయ్ దేవ్ గణ్ అమితాబ్ వంటి స్టార్స్ ప్రధాన పాత్రలు చేస్తున్నారు. గత కొన్ని రోజులుగా



ఈ చిత్ర ప్రమోషన్స్ లో భాగంగా మీడియాతో ముచ్చటిస్తూనే సోషల్ మీడియాలో అందాలు ఆరబోస్తూ రచ్చ రచ్చ చేస్తోంది రకుల్. టాలీవుడ్ లో వరుసగా అగ్ర హీరోలు అందరితో నటించిన రకుల్.. ఆ తర్వాత బాలీవుడ్ వైపు వెళ్లిపోయింది. ఇక అక్కడే బాలీవుడ్ నిర్మాత జాకీ భగ్నానీతో ప్రేమలో పడింది ఈ యాపిల్ బ్యూటీ. జాకీ భగ్నానీతో ప్రేమలో ఉన్నట్లు కొన్నాళ్ల క్రితమే అధికారికంగా సోషల్ మీడియాలో వెల్లడించింది. ఇక అప్పటి నుండి మీడియా అభిమానులు నెటిజన్లు మీరు పెళ్లి ఎప్పుడు చేసుకుంటారు అని అడుగుతూనే ఉన్నారు. మొదట్లో ఈ ప్రశ్న అడిగిన ప్రతి సారి ఇప్పుడే చేసుకోము చేసుకుంటే చెప్తాము అంటూ సమాధానాలిచ్చేది రకుల్. అయినా వరుసగా మీడియా మముందుకొచ్చిన ప్రతి సారీ ఈ ప్రశ్న కచ్చితంగా ఎదురవుతోంది. ఇటీవల బాలీవుడ్ లో ఓ మీడియాకి ఇచ్చిన ఇంటర్వ్యూలో కూడా పెళ్లి గురించి ప్రశ్నించగా ఈ సారి కొంచెం ఘాటుగానే స్పందించింది. పెళ్లి ప్రశ్నకి సమాధానమిస్తూ.. ఇది చాలా సాధారణ విషయం. ప్రతి ఒక్కరి జీవితంలో జరిగేదే. అమ్మ నాన్న తమ్ముడు ఎలా ఉంటారో జీవిత భాగస్వామి కూడా ప్రతి మనిషికి ఉంటారు. దాని గురించి ప్రత్యేకంగా మాట్లాడటం అనవసరం. దయ చేసి ఇలా ప్రతి సారి అడగొద్దు. మా బంధం గురించి ఏదైనా చెప్పాల్సి వస్తే నేనే స్వయంగా చెప్తాను. అంతే గాని ఇలా ప్రతి ఇంటర్వ్యూలోనూ తన గురించి చెప్పాల్సిన అవసరం నాకు లేదు. అని రకుల్ కొంచెం స్ట్రాంగ్ గానే వార్నింగ్ ఇచ్చింది.

## సీఎస్కేకు మరో ఎదురుదెబ్బ.. గాయంతో స్టార్ బౌలర్ ఔట్..!



డిఫెండింగ్ ఛాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్కు ఐపీఎల్ 2022 సీజన్ ఏ మాత్రం కలిసి రావడం లేదు. వరుస పరాజయాలతో (6 మ్యాచ్ల్లో 5 ఓటములు) సతమతమవుతూ పాయింట్ల పట్టికలో 9వ స్థానానికి పరిమితమైన ఆ జట్టును గాయాల బెడద పట్టిపీడిస్తుంది. ఇప్పటికే 14 కోట్లు పోసి కొనుక్కున్న స్టార్ ఆల్‌రౌండర్ దీపక్ చాహర్ సీజన్ మొత్తానికి దూరం కాగా, తాజాగా విదేశీ (న్యూజిలాండ్) పేసర్ ఆడమ్ మిల్నే కూడా చాహర్ బాటలోనే పయనిస్తున్నట్లు తెలుస్తోంది. మోకాలి గాయం కారణంగా మిల్నే కూడా సీజన్ మొత్తానికి దూరం కానున్నాడని సమాచారం. ఈ సీజన్‌లో కేకేఆర్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో బరిలోకి దిగిన మిల్నే.. రెండో మ్యాచ్‌కు ముందు ప్రాక్టీస్ సందర్భంగా గాయపడ్డాడు. స్కానింగ్‌లో గాయం తీవ్రత ఎక్కువగా ఉన్నట్లు తేలడంతో మిల్నేను రెండు వారాల విశ్రాంతి తీసుకోవాల్సిందిగా డాక్టర్లు సూచించారు. గాయం తీవ్రతపై తాజాగా మరోసారి పరీక్షలు నిర్వహించిన వైద్యులు మిల్నే కోలుకోవడానికి మరికొన్ని వారాల సమయం పట్టవచ్చని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల ప్రకారం ఏదో మిరకిల్ జరిగితే తప్ప సీఎస్కే లీగ్ దశ దాటి ముందుకెళ్లడం దాదాపుగా అసంభవం. దీంతో ఆడమ్ మిల్నే సీజన్ మొత్తానికే దూరం కావడం ఖాయంగా తెలుస్తోంది. కాగా, ఈ ఏడాది మెగా వేలంలో మిల్నేను సీఎస్కే 1.9 కోట్లకు కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే. ఇదిలా ఉంటే సీఎస్కే ఏప్రిల్ 21న జరిగే తమ తదుపరి మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్‌తో తలపడనుంది. ముంబైలోని డీవై పాటిల్ స్టేడియంలో ఇరు జట్లు అమీతుమీ తేల్చుకోనున్నాయి. ఈ సీజన్‌లో ముంబై పరిస్థితి సీఎస్కేతో పోల్చుకుంటే మరీ దారుణంగా ఉంది. ఆ జట్టు ఇప్పటివరకు ఆడిన 6 మ్యాచ్‌ల్లో ఓటమిపాలై, పాయింట్ల పట్టికలో అట్టడుగు స్థానంలో నిలిచింది.

## అమితుమీ తేల్చుకోనున్న లక్నో, ఆర్సీబీ.. బలాబలాలు ఎలా ఉన్నాయంటే...?

ఐపీఎల్ 2022 సీజన్‌లో ఇవాళ (ఏప్రిల్ 19) మరో రసవత్తర పోరు జరుగనుంది. ముంబైలోని డీవై పాటిల్ స్టేడియం వేదికగా లక్నో సూపర్ జెయింట్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్లు తలపడనున్నాయి. రాత్రి 7:30 గంటలకు ఈ మ్యాచ్ ప్రారంభంకానుంది. ప్రస్తుత సీజన్‌లో ఇప్పటివరకు చెరి 6 మ్యాచ్‌లు ఆడిన లక్నో, ఆర్సీబీ జట్లు సమంగా నాలుగు మ్యాచ్‌ల్లో గెలుపొందాయి. ఇరు జట్లు పాయింట్ల పరంగా (8) సమంగానే ఉన్నప్పటికీ మెరుగైన రన్‌రేట్ కారణంగా పాయింట్ల పట్టికలో ఆర్సీబీ (4వ స్థానం) కంటే లక్నోనే (3) ముందుంది. జట్ల బలాబలాల విషయానికొస్తే.. ఇరు జట్లు తమ ఆఖరి మ్యాచ్‌ల్లో ప్రత్యర్థులపై గెలుపొంది ఉత్సాహంగా ఉన్నాయి. లక్నో గత మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్‌ను మట్టికరిపించగా, ఆర్సీబీ.. ఢిల్లీ క్యాపిటల్స్‌పై విజయం సాధించింది. కేఎల్ రాహుల్ నేతృత్వంలో లక్నో సూపర్ జెయింట్స్ జట్టు ఇప్పటివరకు ఆడిన మ్యాచ్‌ల్లో బ్యాటింగ్ విభాగంలో పటిష్టంగా కనిపించినప్పటికీ.. బౌలింగ్‌లో కాస్త ఇబ్బంది పడుతున్నట్లు కనిపిస్తుంది. ఆవేశ్ ఖాన్, రవి బిష్ణోయ్ పర్వాలేదనిపిస్తుండగా, దుష్మంత చమీరా, జేసన్ హోల్డర్, కృనాల్ పాండ్యా ధారాళంగా పరుగులు సమర్పించుకుంటున్నారు. ముంబైతో మ్యాచ్‌లో చమీరా 4 ఓవర్లలో 48 పరుగులు సమర్పించుకోవడంతో ఈ మ్యాచ్‌లో అతనిపై వేటు పడే అవకాశం ఉంది. లక్నో ఈ ఒక్క మార్పు మినహాయించి ముంబైతో బరిలోకి దిగిన జట్టునే యధాతథంగా కొనసాగించవచ్చు. ఇక బ్యాటింగ్‌లో జట్టు కెప్టెన్ కేఎల్ రాహుల్ ముంబైపై అద్భుత శతకం సాధించి సూపర్ ఫామ్‌లో కొనసాగుతుండగా, డికాక్, దీపక్ హుడా, ఆయుష్ బదోని గత మ్యాచ్‌ల్లో కీలక ఇన్నింగ్స్‌లు ఆడి జట్టును గెలిపించారు. ముంబైతో మ్యాచ్‌లో రీఎంట్రీ ఇచ్చిన మనీశ్ పాండే 29 బంతుల్లో 6 ఫోర్ల సాయంతో 38 పరుగులు చేసి నేటి మ్యాచ్‌లో ప్లేస్‌ను పక్కా చేసుకున్నాడు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190